Follow: @ANNTELUGU

ANN తెలుగు

14-08-2025

# మహా పత్రిక

గురువారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 251 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## కోదండరాం ఎమ్మెల్సీ రద్దు

### గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై సుప్రీం సంచలన తీర్పు

సరిగ్గా ఏడాది క్రితం ఎమ్మెల్సీలుగా బాధ్యతలు స్వీకరణ

సుప్రీం కోర్టుకు కేటీఆర్ సలాం

**హైదరాబాద్, మహా :**

ఎమ్మెల్సీలు కోదండరాం, అమీర్ అలీఖాన్‌లకు బిగ్ షాక్ తగిలింది. వారి నియామకాన్ని సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఈ మేరకు బుధవారం తీర్పు వెలువరించింది. కాగా, వీరిద్దరూ తెలంగాణ గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా నియామకం అయ్యారు. అయితే వీరి నియామకం అక్రమంగా జరిగిందని.. విచారణ జరిపి నియామకాన్ని రద్దు చేయాలని బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్ సుప్రీంకోర్టు, సత్యనారాయణలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.


మిగతా 2లో

టాప్ న్యూస్

నాకు ప్రాణహాని ఉంది..

## రక్షించండి

- పూణే కోర్టును ఆశ్రయించిన రాహుల్ గాంధీ



03

గువ్వల బాటలో

## పైలట్?

- బీజేపీలో చేరుతారని ప్రచారం
- బీఆర్ఎస్ కు మరో షాక్ తప్పదా?



02

ఐసీసీ ర్యాంకింగ్స్‌లో

## భారత్ జోరు

- టాప్ 10లో నలుగురు మనోళ్లే
- టాప్ 2లోకి దూసుకెళ్లిన రోహిత్



03

# శ్రీధర్ బాబు రోల్ మోడల్

## మిస్టర్ డిపెండబుల్ మినిస్టర్‌కు అరుదైన గౌరవం

### ఇండియా100లో తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు

### ఏఐ రంగంలో దార్శనికుడిగా గౌరవం

ఏఐ అనుకూల కేపిటల్ గా తెలంగాణను నిలపడంలో కీ రోల్

ఏడాదిన్నరలో.. ఎన్నో ఘనతలు.. మరెన్నో విజయాలు సాధించిన తెలంగాణ

సీఎం రేవంత్ ప్రోత్సాహంతోనే ఈ క్రెడిట్ మంత్రి శ్రీధర్ బాబు

సాంకేతిక పురోగతి ఫలితాలు రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి అందేలా కృషి



(కంది రామచంద్రారెడ్డి)

తెలంగాణ కేబినెట్ లో దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మిస్టర్ డిపెండబుల్. సవాల్ ఎలాంటిదైనా తను అడుగుపెట్టనంత వరకే అన్నట్లుగా చాకచక్యంగా సమస్యలు పరిష్కరించడంలో, అనూహ్య ఫలితాలు సాధించడంలో ఆయనకు ఆయనే సాటి. రాష్ట్ర ప్రభుత్వం లో ఆయన ఎంతో స్పెషల్. అందరివాడు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఎంతో ఛాలెంజింగ్ శాఖలు నిర్వహిస్తూ పెట్టుబడుల సాధనలోనే కాక.. పరిశ్రమకు విశ్వాసం కలిగించి తెలంగాణను కొత్త శిఖరాలకు తీసుకెళ్ళడంలో సక్సెస్ అయ్యారు. సమర్థవంతమైన నాయకత్వంతో అద్భుతాలు ఆవిష్కరిస్తున్న శ్రీధర్ బాబు గతంలోని మంత్రులకు భిన్నంగా పని ఎక్కువ చేస్తూ ప్రచారం తక్కువ పొందుతున్నారు. మినిస్టర్ ఎంత కూల్ గా వర్క్ చేసుకుంటూ వెళ్తున్నా పరిశ్రమ ఫలితాలతో పనితీరుతో అబ్బురపడుతూనే ఉంది. అందుకే ఇండియాలోనే అరుదైన గౌరవం దక్కింది.

02

# వానలే.. వానలు

## రాష్ట్రానికి రెడ్ అలర్ట్

- పది జిల్లాల్లో అతి భారీ వర్షాలు
- హైదరాబాద్ సిటీలో మూడు రోజులు ముసురే
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- నిండుగా ప్రాజెక్టులు.. కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు భారీ వరద
- శ్రీశైలానికి పోటెత్తిన వరద.. ఏడు గేట్లు ఓపెన్
- ఎప్పటికపుడు పరిస్థితులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరా.. అధికారుల అలర్ట్
- వరద పరిస్థితిపై మంత్రి ఉత్తమ్ సమీక్ష.. కేంద్ర మంత్రి అమిత్ షాతో మాట్లాడిన కిషన్ రెడ్డి
- జిల్లాల కలెక్టర్లకు కేంద్రమంత్రి బండిసంజయ్ ఫోన్.. భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తం



**హైదరాబాద్, మహా**

తెలంగాణ వ్యాప్తంగా వానలు.. జోర్దార్ గా కురుస్తున్నాయి. రాష్ట్రంలో పది జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తుండగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికార యంత్రాంగాన్ని అలర్ట్ చేశారు. బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో హైదరాబాద్ సిటీతో పాటు జిల్లాల్లోనూ వరుణుడు ప్రతాపం చూపిస్తున్నాడు. జోరు వానలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీవర్షాలతో చెరువులు అలుగుపారుతున్నాయి. మరో రెండురోజులు వర్షాలున్నాయనే వాతావరణశాఖ హెచ్చరికలతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరద పరిస్థితులపై ఎప్పటికపుడు ఆరా తీస్తూ అధికారయంత్రాంగాన్ని అలర్ట్ చేస్తున్నారు. మంత్రి ఉత్తమ్ ప్రాజెక్టులు, చెరువుల్లోని వరద పరిస్థితులపై ఆరా తీశారు. సమీక్ష జరిపారు. కేంద్రమంత్రి అమిత్ షా కిషన్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణకు అవసరమైన సాయం అందించాలని కోరారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని జిల్లాల కలెక్టర్లకు కేంద్రమంత్రి బండి సంజయ్ ఫోన్ చేసి అప్రమత్తం చేశారు. ఇక ప్రాజెక్టుల వద్ద ప్రవాహం ఉద్ధృతిగా ఉన్నందున వాగుల్లోకి చేపల వేట, పశువులు మేపేందుకు వెళ్లొద్దని అధికారులు సూచిస్తున్నారు.

మిగతా 2లో

### కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత

నిర్మల్ జిల్లా కడెం జలాశయానికి ఎగువ నుంచి భారీగా వరద చేరుతోంది. ఇన్‌ఫ్లో దృష్ట్యా అధికారులు దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం స్వర్ణ ప్రాజెక్టులోకి వరద నీరు చేరికతో నీటిని కిందకు వదులుతున్నారు.



## జగన్.. కథలు చెప్పొద్దు

- ధైర్యం ఉంటే రాహుల్ గాంధీకి మద్దతు ఇవ్వు
- అమిత్ షా, మోదీకి సరెండరై.. రాహుల్‌పై విమర్శలు చేస్తావా?
- జగన్‌పై ఏపీ వ్యవహారాల ఇంచార్జ్ మాణిగం ఠాగూర్ ఫైర్

02

## మనుషులకు ఆధార్.. భూములకు భూధార్

- ప్రణాళికలు రూపొందించండి
- సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం



**హైదరాబాద్, మహా :** రాష్ట్ర వ్యాప్తంగా భూములకు భూధార్ నెంబర్ల కేటాయింపునకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అలాగే, రెవెన్యూ సదస్సుల్లో వారసత్వ, ఇతర మ్యుటేషన్లకు సంబంధించి స్వీకరించిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని చెప్పారు. బుధవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలపై ముఖ్యమంత్రి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డితో పాటు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.

మిగతా 2లో

## కంచ గచ్చిబౌలిపై సుప్రీం సంచలన వ్యాఖ్యలు

- మంచి ఫలితాలు ఇస్తే.. తప్పకుండా మెచ్చుకుంటాం
- గతంలో చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకుంటాం



వివరాలు 2లో






బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్ | 1,01,400 |
| 22 క్యారెట్ | 92,950 |
| సిల్వర్ (కేజీ) | 1,15,000 |

## తెలంగాణకు అన్యాయం

- సెమీ కండక్టర్ ప్రాజెక్టు కేటాయింపులో కేంద్రం వివక్ష
- అన్ని అర్హతలు, సంసిద్ధంగా ఉన్నా విస్మరించడంపై ధ్వజం
- పునఃపరిశీలించి న్యాయం చేయాలని మంత్రి శ్రీధర్ బాబు డిమాండ్

**హైదరాబాద్, మహా :**

పారిశ్రామికాభివృద్ధిలో ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా నిలుస్తున్న తెలంగాణకు రాజకీయ అక్కసుతోనే కేంద్రం అన్యాయం చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. సెమీకండక్టర్ ప్రాజెక్టు కేటాయింపులో వివక్ష చూపించి, రాష్ట్రంపై సవతి తల్లి ప్రేమను

మిగతా 3లో


## కోమటిరెడ్డి సోదరులు ఇద్దరూ దమ్మున్నోళ్లే

### జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు



**హైదరాబాద్, మహా:** తమ కాంగ్రెస్‌లో అందరూ దమ్మున్నోళ్ళమే అని, కోమటిరెడ్డి సోదరులు దమ్మున్న వాళ్ళే అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు.

మిగతా 2లో

# శ్రీధర్ బాబు రోల్ మోడల్

## మిస్టర్ డిపెండబుల్ మినిస్టర్‌కు అరుదైన గౌరవం

### ఇండియా 100లో తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు

### ఏఐ రంగంలో దార్శనికుడిగా గౌరవం

ఏఐ అనుకూల కేపిటల్ గా తెలంగాణను నిలపడంలో కీ రోల్

ఏడాదిన్నరలో.. ఎన్నో ఘనతలు.. మరెన్నో విజయాలు సాధించిన తెలంగాణ

సీఎం రేవంత్ ప్రోత్సాహంతోనే ఈ క్రెడిట్ మంత్రి శ్రీధర్ బాబు

సాంకేతిక పురోగతి ఫలితాలు రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి అందేలా కృషి



(కంది రామచంద్రారెడ్డి)

తెలంగాణ కేబినెట్ లో దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మిస్టర్ డిపెండబుల్. సవాల్ ఎలాంటిదైనా తను అడుగు పెట్టనంత వరకే అన్నట్లుగా చాకచక్యంగా సమస్యలు పరిష్కరించడంలో, అనూహ్య ఫలితాలు సాధించడంలో ఆయనకు ఆయనే సాటి. రాష్ట్ర ప్రభుత్వం లో ఆయన ఎంతో స్పెషల్. అందరివాడు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఎంతో ఛాలెంజింగ్ శాఖలు నిర్వహిస్తూ పెట్టుబడుల సాధనలోనే కాక.. పరిశ్రమకు విశ్వాసం కలిగించి తెలంగాణను కొత్త శిఖరాలకు తీసుకెళ్ళడం లో సక్సెస్ అయ్యారు. సమర్థవంతమైన నాయకత్వంతో అద్భుతాలు ఆవిష్కరిస్తున్న శ్రీధర్ బాబు గతంలోని మంత్రులకు భిన్నంగా పని ఎక్కువ చేస్తూ ప్రచారం తక్కువ పొందుతున్నారు. మినిస్టర్ ఎంత కూల్ గా వర్క్ చేసుకుంటూ వెళ్తున్నా పరిశ్రమ ఫలితాలతో పనితీరుతో అబ్బురపడుతూనే ఉంది. అందుకే ఇండియాలోనే అరుదైన గౌరవం దక్కింది. అనలిటిక్స్ ఇండియా మ్యాగజైన్ తాజాగా ప్రకటించిన 'ఇండియాస్ 100 మోస్ట్ ఇన్ఫ్లూయెన్షియల్ పీపుల్ ఇన్ ఏఐ - 2025' జాబితాలో మంత్రి శ్రీధర్ బాబుకు చోటు లభించింది. తమ సమర్థవంతమైన నాయకత్వం, నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహమిస్తూ భారత్‌ను ఏఐ రంగంలో అగ్రగామిగా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తున్న వ్యక్తులకు ఈ జాబితాలో చోటు కల్పించారు. విధాన రూపకర్తల విభాగంలో మంత్రి శ్రీధర్ బాబుతో పాటు కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, పీయూష్ గోయల్, కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, ఇండియా ఏఐ మిషన్ సలహాదారు ఆకృత్ వైష్, ఇండియా ఏఐ మిషన్ సీఈవో, ఎన్ఐసీ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్, ఎన్ పీసీఐ సీఈవో దిలీప్ అస్బే, నీతి ఆయోగ్ మాజీ సీఈవో అమితాబ్ కాంత్, నాస్కామ్ మాజీ అధ్యక్షులు దేబజాని ఘోష్ తదితర ప్రముఖులను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. జాతీయ ప్రముఖులున్న జాబితాలో తెలంగాణ మినిస్టర్ కు చోటు దక్కడం మంత్రిగా శ్రీధర్ బాబు కృషికి నిబద్ధతకు నిదర్శనంగా చెబుతున్నారు

## ఏఐ కేపిటల్

మంత్రి శ్రీధర్ బాబు నాయకత్వంలో ఏఐ రంగంలో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ మారిందని, అందుకే ఆయనను ఈ జాబితాలో చేర్చినట్లు అనలిటిక్స్ ఇండియా మ్యాగజైన్ నిర్వాహకులు ప్రకటించారు. తెలంగాణను ఏఐ కేపిటల్ గా మార్చేందుకు మంత్రి శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణ అమలవుతోంది. అందులో భాగంగానే దేశంలోని మిగతా రాష్ట్రాలకు తెలంగాణ రోల్ మోడల్ గా మారింది. - 'బాధ్యతాయుతమైన ఏఐ అమలు కోసం సమగ్ర ఏఐ ఆధారిత తెలంగాణ స్ట్రాటజీ అండ్ రోడ్ మ్యాప్ ను రూపొందించడంలో కీలకంగా వ్యవహరించారు. గుడ్ గవర్నెన్స్, నూతన ఆవిష్కరణలు, సురక్షితమైన డేటా షేరింగ్‌ను ప్రోత్సహించేలా దేశంలోనే తొలిసారిగా ఏఐ ఆధారిత తెలంగాణ డేటా ఎక్స్చేంజ్ ను ప్రారంభించేందుకు చొరవ చూపారు' 'గ్లోబల్ ఏఐ సమ్మిట్ నిర్వహణలోనూ మంత్రి శ్రీధర్ బాబు కీలకంగా వ్యవహరించారు. తెలంగాణలో ఏఐ ఎకో సిస్టమ్ ను మరింత బలోపేతం చేసేలా 2025–26లో 100 గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లను ప్రారంభించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నారు. ఆర్ అండ్ డీ, నూతన ఆవిష్కరణలు, అత్యంత నైపుణ్యమున్న మానవ వనరులను తయారు చేయాలనే సంకల్పంతో ఏర్పాటు కానున్న ఏఐ యూనివర్సిటీ విషయంలోనూ కీలకంగా వ్యవహరిస్తున్నారు' అని నిర్వాహకులు ప్రశంసించారు. - ఏఐ రంగంలో తెలంగాణ బ్రాండ్ మరింత విశ్వవ్యాప్తమయ్యేలా మంత్రి శ్రీధర్ బాబుకు దక్కిన ఈ గుర్తింపు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు.

## సీఎం రేవంత్ రెడ్డి ప్రోత్సాహంతోనే ఈ గుర్తింపు: మంత్రి శ్రీధర్ బాబు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రోత్సాహంతోనే ఈ అరుదైన గౌరవం దక్కింది. ఇది నా ఒక్కడికి లభించిన గుర్తింపు కాదు. మొత్తం తెలంగాణ ప్రజలకు దక్కిన గౌరవం. సమ్మిళిత వృద్ధి, మెరుగైన జీవితాలను అందించేందుకు ఏఐని వినియోగించాలన్న మా ప్రభుత్వ సుదూర దృష్టికి ఈ గుర్తింపు నిదర్శనం. సీఎం రేవంత్ రెడ్డి ప్రోత్సాహంతోనే నాకు ఈ జాబితాలో చోటు దక్కింది. ఆయన నాయకత్వంలో తెలంగాణను ఏఐ కేపిటల్ ఆఫ్ ది గ్లోబ్‌గా తీర్చిదిద్దేలా పకడ్బందీ కార్యాచరణతో ముందుకెళ్తున్నాం. నూతన ఆవిష్కరణలకు సమానత్వాన్ని జోడించి, సాంకేతిక పురోగతి ఫలితాలు రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి అందేలా కృషి చేస్తున్నామని శ్రీధర్ బాబు అన్నారు.

# వానలే.. వానలు

(మొదటిపేజీ తరువాయి)



ఇప్పటి వరకు అత్యధికంగా సూర్యాపేట జిల్లాలోని మోతె మండలంలో మామిళ్లగూడెంలో 100.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

**దంచికొడుతున్న వానలు**

హైదరాబాద్ మహానగర వ్యాప్తంగా వర్షాలు దంచి కొడుతున్నాయి. వరుణుడి జోరుకు రోడ్లు, లోతట్టు కాలనీలు చెరువులు, నదులను తలపిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. రోడ్లపైకి భారీగా వరద చేరడంతో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. నగర పరిసర ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షానికి మూసీ నదికి వరద పోటెత్తింది. హైదరాబాద్‌లో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేసింది. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అవసరమైతేనే బయటకు రావాలని సూచించింది. ఇప్పటి వరకు అత్యధికంగా రంగారెడ్డి జిల్లా బాలాపూర్‌లో 93.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

**కుండపోత వర్షం :**

హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో కుండపోత వర్షం కురుస్తోంది. ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్లుగా జోరు వాన పడుతుంది. బోయిన్ పల్లి, తిరుమలగిరి, అల్వాల్, బొల్లారం, ప్యాట్నీ, పారడైజ్, బేగంపేట్, మారేడుపల్లి ప్రాంతాల్లోని ప్రధాన రహదారులతో పాటు కాలనీలకు వరద భారీగా చేరింది. పలు చోట్ల డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. బషీర్‌బాగ్, నారాయణగూడ, హిమాయత్నగర్, అబిడ్స్, కోఠి, సుల్తాన్‌బజార్, బేగంబజార్, సైఫాబాద్, ఖైరతాబాద్ పరిసరాల్లోనూ ఎడతెరిపి లేకుండా వాన కురుస్తోంది.

**రాష్ట్రానికి రెడ్ అలర్ట్ - వాతావరణ కేంద్రం డైరెక్టర్ నాగరత్న వెల్లడి**

రాష్ట్రవ్యాప్తంగా నేడు (గురువారం) కూడా భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ మేరకు రాష్ట్రం అంతటికీ రెడ్ అలర్ట్ జారీ చేసింది. సంగారెడ్డి, మెదక్, వికారాబాద్, మేడ్చల్, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, భద్రాద్రి, భూపాలపల్లి, ములుగు జిల్లాలకు రెడ్ కలర్ వార్నింగ్ జారీ చేసినట్లు వాతావరణ కేంద్రం డైరెక్టర్ నాగరత్న తెలిపారు. హైదరాబాద్, హనుమకొండ, ఆదిలాబాద్, జనగామ, కామారెడ్డి, కుమురంభీం, ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, నల్గొండ, రంగారెడ్డి, సిద్దిపేట, వరంగల్ జిల్లాలకు ఆరెంజ్ కలర్ వార్నింగ్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ చేశారు.

**ఉత్తర తెలంగాణలో వర్ష తీవ్రత..**

ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వర్ష తీవ్రత ఎక్కువగా ఉంటుందని తెలిపారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. రాష్ట్రమంతటా నేడు కూడా వర్షాలు కొనసాగే అవకాశం ఉందని నాగరత్న వివరించారు. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని, దీని ప్రభావంతో రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. ఉత్తర తెలంగాణలో 17న వర్ష తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉందని అంచనా వేశారు. వాతావరణ శాఖ హెచ్చరికలతో అధికారులు అప్రమత్తమయ్యారు. భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

**శ్రీశైలానికి పోటెత్తిన వరద.. ఏడు గేట్లు ఓపెన్**

తెలంగాణలోని ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. కృష్ణా నదీ పరీవాహక ప్రాంతంలో ఉన్న జూరాల, శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులకు ఎగువ నుంచి భారీ గా వరద వస్తుండటంతో గేట్లు ఓపెన్ చేసి నీటిని వదలుతున్నారు. గోదావరి బేసిన్ లో శ్రీరాంసాగర్, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులకు స్వల్పంగా వరద వస్తోంది. కడెం, స్వర్ణ జలాశయాల నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలానికి 1,51,47 క్యూసెక్కుల వరద వస్తోంది. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 882.80 అడుగులుగా ఉంది. పూర్తిస్థాయి నీటి నిల్వ 215.8070 టీఎంసీలు కాగా ప్రస్తుతం 203.4290 టీఎంసీలు ఉంది. కుడి, ఎడమ విద్యుదుత్పత్తి కేంద్రాల్లో పవర్ జనరేషన్ నడుస్తోంది. 7 గేట్లు 10 అడుగులు మేర ఎత్తి దిగువకు అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు.

# కోదండరాం ఎమ్మెల్సీ రద్దు

## గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై సుప్రీం సంచలన తీర్పు

సరిగ్గా ఏడాది క్రితం ఎమ్మెల్సీలుగా బాధ్యతలు స్వీకరణ..

సుప్రీం కోర్టుకు కేటీఆర్ సలాం

(మొదటిపేజీ తరువాయి)



బుధవారం విచారణ జరిపిన అత్యున్నత న్యాయ స్థానం.. వారి నియామకం చెల్లదని తీర్పును వెలువరించింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 17వ తేదీకి వాయిదా వేసింది. వివరాల్లోకి వెళితే.. 2023 ఆగస్టులో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణలను గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా నామినేట్ చేసింది. అయితే, అప్పటి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పలు కారణంతో తిరస్కరించారు. అనంతరం 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కోదండారాం, అమీర్ అలీ ఖాన్‌లను గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా కాంగ్రెస్ ప్రభుత్వం నామినేట్ చేసింది. వీరి నామినేషన్లను గవర్నర్ ఆమోదించారు. అయితే దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ గవర్నర్ తమ నామినేషన్లను తిరస్కరించడాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్లు దాఖలు చేశారు. ఇపుడు దీనిపై సుప్రీం సంచలన తీర్పునిచ్చింది. సరిగ్గా ఏడాదిక్రితం ఆగస్టు 16, 2024లో ఇద్దరూ ఎమ్మెల్సీలుగా బాధ్యతలు స్వీకరించగా, ఇపుడు వీటిని సుప్రీం కోర్టు నిలిపేసింది. దీనితో తదుపరి వ్యూహంపై సర్కారు కసరత్తు చేస్తోంది.

**సుప్రీంకోర్టుకు సలాం చేసిన కేటీఆర్**

తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ కోదండరామ్, జర్నలిస్టు అమీర్ అలీఖాన్ నియామకాలపై న్యాయస్థానం స్టే విధించి.. వారి నియామకాలను నిలిపివేస్తూ తీర్పు ఇచ్చింది. ఈ తీర్పుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. 'గవర్నర్ కోటా కింద కాంగ్రెస్ నియమించిన ఇద్దరు ఎమ్మెల్సీల ఎన్నిక చెల్లదని దేశ అత్యున్నత న్యాయ స్థానమైన సుప్రీంకోర్టు ఇచ్చిన సంచలన తీర్పు అటు బీజేపీకి, ఇటు కాంగ్రెస్‌కు చెంపపెట్టు. గతంలో బీజేపీ.. గవర్నర్ వ్యవస్థను దుర్వినియోగం చేసి బీఆర్ఎస్ పంపిన ఇద్దరు ఎమ్మెల్సీ ప్రతిపాదనలకు అడ్డుపడితే, ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ప్రక్రియ పెండింగ్‌లో ఉండగానే మరో ఇద్దరి పేర్లను సిఫారసు చేసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసింది. రాజ్యాంగంపై ఏమాత్రం గౌరవం లేని ఈ రెండు ఢిల్లీ పార్టీల అప్రజాస్వామిక విధానాలు ఎంతమాత్రం సాగనివ్వమని చాటిచెప్పిన గౌరవ న్యాయవ్యవస్థకు బీఆర్ఎస్ పక్షాన శిరస్సు వంచి సలాం చేస్తున్నాం' అని కేటీఆర్ ట్వీట్‌లో పేర్కొన్నారు.

# కోమటిరెడ్డి సోదరులు ఇద్దరూ దమ్మున్నోళ్లే



(మొదటిపేజీ తరువాయి)

కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి రావడానికి దొంగ ఓట్లే కారణమని ఆరోపించారు. ఎన్నికల సంఘం బీజేపీ అడుగు జాడల్లో నడుస్తోందని, ఓట్ల చోరీపై ఈసీకి వ్యతిరేకంగా పోరాడుతున్న రాహుల్ గాంధీకి దేశం మొత్తం మద్దతివ్వాలన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల కమిషనర్ బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు రాసిచ్చిన స్క్రిప్ట్ చదువుతున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీ అడుగుతున్న ప్రశ్నలపై విచారణ చేయడం లేదని ఈసీని రాహుల్ గాంధీ ప్రశ్నిస్తున్నారన్నారు. రాహుల్ గాంధీ కుటుంబం మీద బీజేపీది కక్ష సాధింపు చర్యలకు దిగుతోందని మండిపడ్డారు. మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి బీజేపీ స్క్రిప్ట్ చదవాలి కావున ఆ పనే చేశారని, ఆయన బీజేపీ లీడరా లేక ఎన్నికల కమిషనరా అర్థం కాలేదని జగ్గారెడ్డి ధ్వజమెత్తారు.

# మనుషులకు ఆధార్.. భూములకు భూధార్

## ప్రణాళికలు రూపొందించండి.. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం



(మొదటిపేజీ తరువాయి)

లైసెన్డ్ సర్వేయర్లు సర్వే చేసిన అనంతరం రెగ్యులర్ సర్వేయర్లు వాటిని స్క్రూటినీ చేసేలా చూడాలని ఆదేశించారు. కోర్ అర్బన్ ఏరియాలో నూతనంగా నిర్మించనున్న 10 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నమూనాలను పరిశీలించారు. ప్రతి కార్యాలయంలో పార్కింగ్, క్యాంటీన్, ఇతర మౌలిక వసతులు ఉండాలని, కార్యాయాలు పూర్తిగా ప్రజలకు స్నేహపూర్వక వాతావరణంలో, సౌకర్యవంతంగా ఉండేలా చూడాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో పెద్ద సంఖ్యలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తయిందని అధికారులు వివరించగా, ఈ నెలాఖరులోగా ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్ నగరంలోని హౌసింగ్ బోర్డుతో జాయింట్ వెంచర్‌గా ఉన్న ప్రాజెక్టుల్లోని తలెత్తిన సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం ముఖ్య కార్యదర్శులు వి.శేషాద్రి, కె.ఎస్.శ్రీనివాసరాజు, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, సీసీఎల్ఏ కార్యదర్శి డి.ఎస్.లోకేశ్ కుమార్, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## కంచ గచ్చిబౌలిపై సుప్రీం సంచలన వ్యాఖ్యలు

- మంచి ఫలితాలు ఇస్తే.. తప్పకుండా మెచ్చుకుంటాం
- గతంలో చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకుంటాం

**ఢిల్లీ, మహా :** కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై బుధవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. కంచ గచ్చిబౌలి భూముల్లో పర్యావరణ పునరుద్ధరణ చర్యలు చేపడుతున్నామని కోర్టుకు తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. సమగ్ర ప్రణాళికను సమర్పించేందుకు ప్రభుత్వం ఆరు వారాలు గడువు కోరింది. అభివృద్ధికి తాము అడ్డుకాదని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. సుస్థిర అభివృద్ధి ముఖ్యమని సీజేఐ ధర్మాసనం పేర్కొంది. అభివృద్ధి చేసేటప్పుడు పర్యావరణ పరిరక్షణను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ సూచించారు. కంచ గచ్చిబౌలి భూముల్లో ప్రభుత్వ పర్యావరణ పరిరక్షణ చర్యలు మంచి ఫలితాలు ఇస్తే తప్పకుండా మెచ్చుకుంటామని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. గతంలో చేసిన వ్యాఖ్యలను కూడా ఉపసంహరించుకొని మరింతగా ప్రశంసిస్తామని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు.

# జగన్ కథలు చెప్పొద్దు

- ధైర్యం ఉంటే రాహుల్ గాంధీకి మద్దతు ఇవ్వు
- అమిత్ షా, మోదీకి సరెండరై.. రాహుల్‌పై విమర్శలు చేస్తావా?
- జగన్‌పై ఏపీ వ్యవహారాల ఇంచార్జ్ మాణిగం ఠాగూర్ ఫైర్



**ఢిల్లీ, మహా:** ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఏపీ వ్యవహారాల ఇంచార్జ్ మాణిగం ఠాగూర్ కౌంటర్ ఇచ్చారు. స్టోరీలు వద్దు.. ఓట్ల చోరీ అంశంపై రాహుల్ పోరాటాన్ని అభినందించాలి.. మద్దతు పలకాలని జగన్మోహన్ రెడ్డికి సూచించారు. బుధవారం జగన్ మీడియాతో మాట్లాడుతూ.. ఏపీలో కూడా ఓట్ చోరీ జరిగిందని కానీ రాహుల్ ఇక్కడి అంశాలపై మాట్లాడటం లేదన్నారు . చంద్రబాబు, రేవంత్, మోదీ మధ్య హాట్ లైన్ ఉందన్నారు. అందుకే మాట్లాడటం లేదన్నారు. అలాగే ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ ఏపీలో జరుగుతున్న అవినీతిపై మాట్లాడటం లేదన్నారు. ఈ వ్యాఖ్యలపై ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మాణికం ఠాగూర్ వెంటనే స్పందించారు. కథలు చెప్పవద్దని.. ధైర్యం ఉంటే రాహుల్ గాంధీకి మద్దతుగా పోరాటానికి రావాలని ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మాణికం ఠాగూర్ పిలుపునిచ్చారు. గురువారం విజయవాడలో ఓటు చోరీకి వ్యతిరేకంగా షర్మిల ర్యాలీ చేస్తున్నారని అందులో పాల్గొనాలన్నారు. రాహుల్ గాంధీ.. ప్రజాస్వామ్యం కోసం పోరాడుతున్నారని.. రాజకీయం కోసం కాదన్నారు. కేసుల కోసం అమిత్ షా, మోదీకి సరెండర్ అయిపోయి రాహుల్ పై విమర్శలు చేయడం ఏమిటని ప్రశ్నించరా. జగన్ మోహన్ రెడ్డిలా రాహుల్ గాంధీ ఎవరికీ సరెండర్ కాలేదన్నారు. సోషల్ మీడియాలో ఈ మేరకు వీడియో విడుదల చేశారు.




# గువ్వల బాటలో పైలట్?

## బిజెపిలో చేరుతారని ప్రచారం

### బిఆర్ఎస్ కు మరో షాక్ తప్పదా?

**హైదరాబాద్, మహా**

ఫామ్ హౌజ్ కేసులో ఉన్న మాజీ ఎమ్మెల్యేలలో ఒకరి తర్వాత మరొకరు బిజెపి బాట పట్టవచ్చన్న ప్రచారం జరుగుతోంది. మొదట అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బిజెపి తీర్థం పుచ్చుకోగా, ఇపుడు అదే దారిలో మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి పయనిస్తున్నాడన్న ప్రచారముంది. ఇప్పటికే బీజేపీ పెద్దలతో ఆయా నేతలు టచ్‌లో ఉన్నట్లు చెబుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నాటికి ఆయా నేతలు పార్టీ మారినా ఆశ్చర్యపోనక్కర్లేదని అంటున్నారు. నలుగురు మాజీల కోసం జాతీయస్థాయి నేతల సంప్రదింపులు జరుగుతున్నాయని చెబుతున్నారు.

# తెలంగాణకు అన్యాయం

(మొదటిపేజీ తరువాయి)

చూపిస్తుందంటూ బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో మండిపడ్డారు. 'ప్రపంచ స్థాయి అధునాతన సిస్టమ్ అండ్ ప్యాకేజింగ్ ఫెసిలిటీ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. మహేశ్వరంలో 10 ఎకరాల భూమి కేటాయించాం. అన్ని రకాల సబ్సిడీలకు ఆమోదం తెలిపాం. రికార్డు సమయంలో అన్ని అనుమతులిచ్చాం. ఇండియా సెమీకండక్టర్ మిషన్ తుది ఆమోదం లభిస్తే పనులు మొదలు పెట్టేందుకు సదరు ఇన్వెస్టర్ సిద్ధంగా ఉంది అయినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు' అని విమర్శించారు.

**ఏపీకి ఎలా కేటాయిస్తారు..?**

అన్ని రకాలుగా అర్హతలున్నా తెలంగాణను విస్మరించి కనీస సంసిద్ధత లేని ఏపీకి ప్రాజెక్టును ఎలా కేటాయిస్తారని మంత్రి శ్రీధర్ బాబు కేంద్రాన్ని ప్రశ్నించారు. 'తర్కానికి అందని, న్యాయ విరుద్ధమైన ఈ నిర్ణయం పెట్టుబడిదారులకు తప్పుడు సంకేతాలను పంపే ప్రమాదముంది. ఇలాంటి రాజకీయ ప్రేరేపిత నిర్ణయాలు దేశ పారిశ్రామికాభివృద్ధికి మంచిది కాదు. అందుకే ఈ నిర్ణయాన్ని మరోసారి పున:పరిశీలించాల్సిన అవసరముంది. వాస్తవ పరిస్థితులను పరిగణలోనికి తీసుకుని తెలంగాణకు మేలు చేసేలా కేంద్రం నిర్ణయం తీసుకోవాలి' డిమాండ్ చేశారు.

**కిషన్ రెడ్డి చొరవ తీసుకోవాలి**

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి జోక్యం చేసుకుని తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని, న్యాయం జరిగేలా చొరవ చూపాలని శ్రీధర్ బాబు కోరారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాల్సిన తెలంగాణ బీజేపీ ఎంపీలు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికీ స్పందించకపోతే తెలంగాణ ప్రజలు అన్నిగమనిస్తున్నారు. రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

# పార్టీ కమిటీలు వెంటనే వేయాలి

- మండల కమిటీలను నెలాఖరులోగా వేయాలి
- గ్రామ కమిటీలు సెప్టెంబర్ 15 వరకు పూర్తి చేయాలి
- అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలి
- ఓట్ చోరీ అంశాన్ని ప్రజల్లో బాగా ప్రచారం చేపట్టాలి
- జూమ్ మీటింగ్ లో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



**హైదరాబాద్, మహా:** జనహిత పాదయాత్ర విజయవంతం చేయాలని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం టీపీసీసీ చీఫ్ అధ్యక్షతన జూమ్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, జిల్లా ఇంచార్జ్ లు మంత్రి పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లతోపాటు డీసీసీ లు, జిల్లా ఇంచార్జ్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ కమిటీలు వెంటనే వేయాలన్నారు. వరదల్లో ప్రజలకు అండగా ఉండాలని సూచించారు. మండల కమిటీలను నెలాఖరులోగా వేయాలని, గ్రామ కమిటీలను సెప్టెంబర్ 15 వరకు పూర్తి చేసి పంపాలని చెప్పారు. ఈ నెల 24 నుంచి రెండో విడత జనహిత పాదయాత్ర ప్రారంభం అవుతుందని, పాదయాత్రలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనేలా ప్రణాళికలు చేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని అన్నారు.

**మూడు దశల్లో ఉద్యమం..**

రాహుల్ గాంధీ చేపట్టిన బీజేపీ ఈసీ అక్రమాలపై ఓట్ చోరీ అంశాన్ని ప్రజల్లో బాగా ప్రచారం చేపట్టాలన్నారు. రాష్ట్రంలో తీవ్రమైన వర్షాలు వరద పరిస్థితులు ఉన్న నేపథ్యంలో ప్రజలకు కాంగ్రెస్ క్యాడర్ అందుబాటులో ఉండి వారికి సహాయ సహకారాలు అందించి భరోసా కల్పించాలని దిశా నిర్దేశం చేశారు. 'ఓట్ల దొంగలు గద్దె దిగండి' అనే ఉద్యమానికి ఏఐసీసీ పిలుపునిచ్చిందని తెలిపారు. మూడు దశల్లో ఉద్యమం ఉంటుందని, ఆగస్టు 14న రాత్రి 8 గంటలకు దేశవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో మాస్ క్యాండిల్ ర్యాలీ ప్రదర్శనలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర, డీసీసీ కార్యవర్గం, ఎమ్మెల్సీలు, అనుబంధ సంఘాల నాయకులు, బ్లాక్, మండల అధ్యక్షులు అన్ని విభాగాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని సూచించారు. అలాగే ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 7 వరకు భారీ రాష్ట్ర స్థాయి ప్రదర్శన నిర్వహించాలని, రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర రాజధాని ప్రధాన నగరాల్లో ప్రదర్శన చేపట్టాలని నిర్ణయించారు. బీజేపీ ఈసీ కుమ్మక్కు పైన నాయకులు ప్రసంగించాలని, భారీ జన సమీకరణ చేపట్టాలని పిలుపునిచ్చారు. అన్ని విభాగాల నాయకులు సీనియర్ నాయకులు పాల్గొనాలని, పాదయాత్రలు, వాహన ప్రదర్శనలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలను భాగస్వాములను చేసి బీజేపీ ఓట్ చోరీలపై ప్రసంగాలు చేయాలన్నారు. సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 15 వరకు జాతీయ స్థాయిలో నెల రోజుల పాటు గడప గడప కు తిరిగి సంతకాల సేకరణ ఉద్యమాన్ని చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు.

# నాకు ప్రాణహాని ఉంది.. రక్షించండి

## పూణే కోర్టును ఆశ్రయించిన రాహుల్ గాంధీ



**మహా :** తనకు ప్రాణహాని ఉందని, రక్షించండి అంటూ రాహుల్ గాంధీ పూణే కోర్టుకు ఆశ్రయించడం ప్రస్తుతం సంచలనంగా మారింది. వీర్ సావర్కర్‌పై తాను చేసిన వ్యాఖ్యల కారణంగా తన ప్రాణాలకు ముప్పు ఉందని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఇద్దరు నాయకులు.. తనను బహిరంగంగానే బెదిరించినట్లు రాహుల్ గాంధీ వెల్లడించారు. ఈ సందర్భంగా తనకు అదనపు భద్రతను కల్పించాలని.. రాహుల్ గాంధీ కోర్టుకు విజ్ఞప్తి చేశారు. సత్యకి సావర్కర్ అనే వ్యక్తి పూణేలోని ప్రత్యేక కోర్టులో రాహుల్ గాంధీపై ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు కాగా.. విచారణ జరుగుతోంది. వీర్ సావర్కర్ పరువు నష్టం కలిగించేలా రాహుల్ గాంధీ వ్యాఖ్యలు చేశారని కేసు నమోదైంది. ఈ క్రమంలోనే ఈ కేసులో పూణే స్పెషల్ కోర్టుకు హాజరైన రాహుల్ గాంధీ.. సంచలన వ్యాఖ్యలు చేశారు. తనపై ఈ కేసులో ఫిర్యాదు చేసిన సత్యకి సావర్కర్.. నాథూరామ్ గాడ్సే, గోపాల్ గాడ్సే వారసుడు అని.. వారి చరిత్ర హింసతో కూడి ఉందని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌లో రవ్‌నీత్ సింగ్ బిట్టు అనే వ్యక్తి పేరును ప్రస్తావించారు. దేశంలోనే నంబర్ వన్ ఉగ్రవాది రాహుల్ గాంధీ అని.. రవ్‌నీత్ సింగ్ బిట్టు పేర్కొన్నట్లు ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేసు విచారణకు రాహుల్ గాంధీ హాజరయ్యే సమయంలో అదనపు భద్రత కల్పించాలని ఆయన తరపు న్యాయవాది కోర్టుకు కోరారు.

# ఐసీసీ ర్యాంకింగ్స్‌లో భారత్ జోరు

## టాప్ 10లో నలుగురు మనోళ్లే.. టాప్ 2లోకి దూసుకెళ్లిన రోహిత్

**మహా:** టీమ్ఇండియా వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ తాజా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో సత్తా చాటాడు. ఒక స్థానం మెరుగుపర్చుకొని రెండో ప్లేస్ దక్కించుకున్నాడు. ప్రస్తుతం హిట్‌మ్యాన్ 756 రేటింగ్స్‌తో రెండో స్థానంలో కొనసాగడం విశేషం. యంగ్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ తన అగ్రస్థానం పదిలం చేసుకున్నాడు. 784 రేటింగ్ పాయింట్స్‌తో గిల్ టాప్‌లో ఉండగా, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ 736 రేటింగ్స్‌తో నాలుగో ప్లేస్‌లో ఉన్నాడు. ఇలా టాప్ 2 ర్యాంకులు మనోళ్లవే కాగా, టాప్ 5లో ముగ్గురు టీమ్ఇండియా బ్యాటర్లు ఉండడం విశేషం.

**టాప్-10 బ్యాటర్లు**

శుభ్‌మన్ గిల్ (భారత్) 784 పాయింట్లు
రోహిత్ శర్మ (భారత్) 756 పాయింట్లు
బాబర్ అజామ్ (పాకిస్థాన్) 751 పాయింట్లు
విరాట్ కోహ్లీ (భారత్) 736 పాయింట్లు
డారిల్ మిచెల్ (న్యూజిలాండ్) 720 పాయింట్లు
చరిత్ అసలంక (శ్రీలంక) 719 పాయింట్లు
హ్యారీ టెక్టర్ (ఐర్లాండ్) 708 పాయింట్లు
శ్రేయస్ అయ్యర్ (భారత్) 704 పాయింట్లు
ఇబ్రహీం జద్రాన్ (అఫ్ఘానిస్థాన్) 676
కుశాల్ మెండిస్ (శ్రీలంక) 669



టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మేనల్లుడు పవన్ రాజ్ – సాయి శృతి వివాహ మహోత్సవంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట స్వామి, జూపల్లి కృష్ణారావు, వాకాటి శ్రీహరి, ఆంధ్రప్రదేశ్ మంత్రి నాదెళ్ల మనోహర్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## కాళేశ్వరం మోటార్లు ఆన్ చేసి

# రిజర్వాయర్లు నింపండి

## 5 లక్షల ఎకరాల సాగుకు పంపింగ్ ప్రారంభించండి

### రాజకీయాలకు అతీతంగా నీటి పంపింగ్‌కు చర్యలు చేపట్టాలి

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు లేఖ

**హైదరాబాద్, మహా:** కాళేశ్వరం మోటార్లు ఆన్ చేసి వెంటనే రిజర్వాయర్లు నింపాలంటూ రాష్ట్ర ఇగిరేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు లేఖ రాశారు. రిజర్వాయర్లలో నీటిని సకాలంలో నింపకపోవడం వల్ల పంటల సాగు ముందుకు పోక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని తన లేఖలో పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో వివిధ జిల్లాలోని రిజర్వాయర్లు మిడ్ మానేరు, అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, బస్వాపూర్ రిజర్వాయర్లను నింపి, సుమారు 5 లక్షల ఎకరాల ఆయకట్టు పరిధిలోని రైతుల ప్రయోజనాల దృష్ట్యా, కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ప్యాకేజ్ 6 వద్ద గల మోటార్లను ఆన్ చేసి నీటి పంపింగ్ చేయాలని హరీష్‌రావు లేఖలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఇటీవల ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో వచ్చే ప్రతి నీటి చుక్కని ఒడిసి పట్టడం కోసం సకాలంలో కాళేశ్వరం ప్రాజెక్టు పంప్ లను ఆన్ చేయాలని రైతుల పక్షాన డిమాండ్ చేస్తున్నట్లుగా హరీశ్ రావు పేర్కొన్నారు.

**ఏ మాత్రం ఆలస్యం చేయకుండా..**

కాళేశ్వరం ప్రాజెక్టు అంతర్భాగమైన శ్రీ పాద ఎల్లంపల్లి రిజర్వాయర్ పూర్తి నీటి సామర్థ్యం 20 టీఎంసీలు ప్రస్తుత సుమారు 14 టీఎంసీల నీటి లభ్యత ఉన్నది, కడెం నుండి దాదాపు 22,300 క్యూసెక్కుల వరద ఉందని, అదేవిధంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో పూర్తి నీటి సామర్థ్యం 80 టీఎంసీలు, ప్రస్తుతం సుమారు



45 టీఎంసీల నీటి లభ్యత ఉన్నదని లేఖలో వివరించారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల వలన గోదావరిలో ఇన్ ఫ్లో పెరిగిన విషయం మీకు తెలిసిందేనని గుర్తు చేశారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని ప్యాకేజ్ 6 వద్ద గల నంది పంప్ హౌస్‌లోని మోటార్లను ఆన్ చేసి నీటి పంపింగ్ ప్రారంభించి తద్వారా కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మిడ్ మానేరు, అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, బస్వాపూర్ తదితర రిజర్వాయర్ లను నింపాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఆయా రిజర్వాయర్ల పరిధిలోని చెరువులను, చెక్ డ్యామ్‌లను అన్నింటిని నింపి సుమారు 5 లక్షల ఎకరాలకు నీరందించేలా ఏ మాత్రం ఆలస్యం చేయకుండా నీటి పంపింగ్ చేపట్టాలని రైతుల పక్షాన కోరుతున్నామని తెలిపారు.



# అధికారులు బీ అలర్ట్!

## వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

### ప్రాజెక్టులు, అనకట్టలు, కాల్వల భద్రతపై నిఘా పెట్టాలి

### అధికారులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలు

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో భారీ, అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందంటూ వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపధ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. ప్రాజెక్టులు, అనకట్టలు, కాల్వలతో పాటు చెరువుల భద్రతపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ నిఘా పెంచాలని ఆయన సూచించారు. విపత్తులు సంభవించే సూచనలు కల్పిస్తే అధికార యంత్రాంగాన్ని తక్షణమే అప్రమత్తం చేయాలన్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లతో సహా అన్నివిభాగాల అధికారులతో నీటిపారుదల శాఖాధికారులు సమన్వయం చేసుకుంటూ వర్షాలతో ఎటువంటి నష్టాలు కలుగకుండా ముందస్తు బందోబస్తు చర్యలు చేపట్టేందుకు నీటిపారుదల శాఖాధికారులు సన్నద్ధం కావాలని ఆయన చెప్పారు. క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పరిస్థితిలపై ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటు ఎటువంటి సందర్భం ఎదురైన తక్షణ నివారణ చర్యలు తీసుకునేందుకు వీలుగా సిద్ధం కావాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.. రాష్ట్ర నీటిపారుదల శాఖా ప్రధాన కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, జాయింట్ సెక్రటరీ కే. శ్రీనివాస్, ఇఆన్సీ అంజద్ హుస్సేన్‌లతో పాటు ఆయా జిల్లాల సీఈలకు ఆదేశాలు జారీ చేశారు

# ఇకపై ఒక్క రోజులోనే వీసా జారీ

**న్యూఢిల్లీ, మహా :** ఇప్పటి వరకు వీసా జారీ చేయడానికి కొన్ని వారాల సమయం పట్టేది. అన్ని పత్రాలు సమర్పిస్తే ఇకపై ఒక్క రోజులోనే వీసాను పొందే అవకాశాన్ని కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం నిబంధనల్లో వెసులు బాటు తీసుకొచ్చింది. అట్లాగే అక్రమ వలసదారులు, గడువు మించి ఉండే విదేశీయులపై పర్యవేక్షణను మరింత బలోపేతం చేసేందుకు డిస్ట్రిక్ట్ పోలీస్ మాడ్యూల్ (డీపీఎం), ఫారినర్స్ ఐడెంటిఫికేషన్ పోర్టల్ (ఎఫ్ఐపీ) అనే రెండు కొత్త పోర్టల్స్ ను ప్రారంభించింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అధ్యక్షతన బుధవారం న్యూఢిల్లీలోని నార్త్ బ్లాక్‌లో విదేశీ విభాగం ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వీసాల విధానాల సరళతరం, ఇమ్మిగ్రేషన్ చెక్ పోస్టుల ఆధునీకరణ వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయా అంశాల్లో పురోగతిని అధికారులు కేంద్ర మంత్రికి వివరించారు. వీసా విధానాన్ని సులభతరం చేసేందుకు అనేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గతంలో వీసా పొందేందుకు 26 సబ్ కేటగిరీలుండగా వాటిని 22కి కుదించామని, అట్లాగే గతంలో 104 సబ్ కేటగిరీలుంటే 69 కి తగ్గించినట్లు వెల్లడించారు. 2024లో జారీ చేసిన మొత్తం వీసాలలో ఈ వీసాల వాటా 65.15 శాతం. వీసా విధానాల సులభతరం వల్ల వీసా జారీ సగటు సమయం కొన్ని వారాల నుండి ఒక రోజులోపు తగ్గినట్లు తెలిపారు. ఇమ్మిగ్రేషన్ చెక్ పోస్టు (ఐసీపీ)ల ఆధునీకరణలో భాగంగా ఆటోమేటెడ్ ట్రావెల్ డాక్యుమెంట్ స్కానింగ్, బయోమెట్రిక్ నమోదు సదుపాయాలను కల్పించినట్లు అధికారులు పేర్కొన్నారు. 2014 నాటికి దేశంలో 82 ఇమ్మిగ్రేషన్ చెక్ పోస్టులుండగా, ప్రస్తుతం 114కి (వీటిలో 37 ఎయిర్, 37 రోడ్డు, 34 సముద్ర, 6 రైల్వే) పెంచినట్లు వివరించారు. అట్లాగే ఢిల్లి, ముంబై, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్, కొచ్చి, అహ్మదాబాద్‌లలో ఫాస్ట్‌ట్రాక్ ఇమ్మిగ్రేషన్ ట్రస్టెడ్ ట్రావెలర్ ప్రోగ్రాం (ఎఫ్టీఐటీటీపీ) అమలు చేస్తున్నట్లు పేర్కొన్న అధికారులు ప్రీవెరిఫైడ్ ప్రయాణికులు ఈ విమానాశ్రయాల్లో కేవలం ఒకే ఒక్క నిమిషంలోనే ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్ పొందవచ్చునని వివరించారు. త్వరలో ఈ సౌకర్యాన్ని కోజికోడ్, లక్నో, తిరువనంతపురం, అమృత్సర్, తిరుచిరాపల్లి, నోయిడా, నవి ముంబై విమానాశ్రయాలకు విస్తరించనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు సుమారు 50 లక్షల ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) కార్డులు జారీ చేయడంతోపాటు ఓసీఐ పోర్టల్‌ను పునరుద్ధరించి మరింత సులభమైన సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్‌లకు చెందిన 6 నిర్దిష్ట మైనారిటీ సమూహాల పౌరసత్వ దరఖాస్తుదారులకు సాయం చేయడానికి "సీఏఏ2019" మొబైల్ యాప్ అభివృద్ధి చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా అధికారుల పనితీరును అభినందించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ వీసా, ఇమ్మిగ్రేషన్ విషయంలో ప్రయాణీకులకు ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్రం తీసుకున్న నిర్ణయాలను, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో సాధారణ ప్రజలకు చేరవేయాలని ఆదేశించారు

# మద్యం వినియోగంలో మనమే టాప్




- మద్య పానం కోసం ఒక్కో వ్యక్తి సగటు ఖర్చు రూ. 3061
- బీరు తాగడంలో తెలంగాణ దేశంలోనే నెం. 1
- ఎన్ఐపీఎఫ్ పీ వెల్లడి

**హైదరాబాద్, మహా :** మద్యం వినియోగంలో దేశంలోనే తొలి స్థానంలో తెలంగాణ నిలిచింది. బీరు తాగడంలో రూరల్ తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. ఇక సిగరెట్లు తాగే విషయంలో 5వ స్థానంలో ఉందని నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ(ఎన్ఐపీఎఫ్ పీ) సంస్థ చేసిన అధ్యయనంలో ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి. 2022 23 సంవత్సరానికి సంబంధించిన ఈ సమాచారాన్ని ఎన్ఐపీఎఫ్ పీ సంస్థ తాజాగా రిలీజ్ చేసింది. ఈ నివేదిక ప్రకారం తెలంగాణలోని గ్రామాల్లో ఒక వ్యక్తి సగటున బీరు, విదేశీ మద్యం కోసం రూ.3,061 ఖర్చు చేస్తున్నట్లు సర్వే పేర్కొంది. అలాగే మత్తు పదార్థాల వినియోగంలోనూ తెలంగాణ దేశంలోనే టాప్ స్థానంలో ఉన్నట్లు ఈ నివేదిక స్పష్టం చేసింది. ఈ మేరకు 201112 నుంచి 202223 సంవత్సరాలకు సంబంధించిన వివరాలను రిలీజ్ చేసింది. రాష్ట్రంలోని గ్రామాల్లో ఒక వ్యక్తి సగటున బీరు, విదేశీ మద్యం కోసం రూ.3,061 ఖర్చు చేస్తున్నట్లు తేలింది. ఇది దేశ సగటు రూ.486 తో పోలిస్తే ఆరు రెట్లు అధికం అని స్పష్టం చేసింది. అలాగే తెలంగాణలో మద్యం ఖర్చు 201415లో రూ.745 ఉండగా అది కాస్తా 202223లో రూ.1,623కు పెరిగినట్లు తెలిపింది. ఇక ధూమపానం విషయంలో తెలంగాణ ఐదో స్థానంలో ఉందని పేర్కొంది. ఇక పట్టణాల్లో ఉన్న ధనవంతులు సిగరెట్లు, బీరు అధికంగా తీసుకుంటున్నారని.. అలాగే పల్లెల్లో తక్కువ, మధ్య ఆదాయం ఉన్నవారు పొగాకు, సిగరెట్లు ఎక్కువగా వాడుతున్నారని స్పష్టం చేసింది. ఇక తెలంగాణలో మద్యం, పొగాకు కోసం చేసే ఖర్చు దేశంలోని అనేక రాష్ట్రాల కంటే అధికంగా ఉన్నట్లు వివరించింది.

# ఆరు రోజుల్లో 2.51 కోట్ల ఫ్రీ జర్నీ

- రాఖీ రోజు 45. 62 లక్షల మంది మహిళల ప్రయాణం
- ఒక్క రోజులో ఇంత మంది మహిళల జర్నీ చేయడం తొలిసారి
- టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ వెల్లడి
- మహాలక్ష్మి పథకం వినియోగంపై మంత్రి పొన్నం హర్షం




**హైదరాబాద్, మహా:** గత ఏడాది రాఖీకి 2.75 కోట్ల ప్రయాణికులను గమ్యస్థానాలకు చేసిందని, ఈ ఏడాది 3.68 కోట్ల మంది రాకపోకలు సాగించారని టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా తెలంగాణ ఆర్టీసీ బస్సులను మహిళలు పెద్ద ఎత్తున వినియోగించుకున్నారని, ఆరు రోజుల్లో మొత్తం 3.68 కోట్ల మంది రాకపోకలు సాగించగా.. అందులో 2.51 కోట్ల ఉచిత ప్రయాణాలు ఉన్నాయని ఈ నెల 9న రాఖీ పండుగ రోజున 45. 62 లక్షల మంది మహిళలు ప్రయాణించగా.. ఈ నెల 11న అత్యధికంగా 45.94 లక్షల మంది రాకపోకలు సాగించారని పేర్కొన్నారు. ఒక్క రోజులో ఇంత మంది మహిళలు ప్రయాణించడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. గతేడాదితో పోలిస్తే 92.95 లక్షల మంది ఎక్కువగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారని.. ఈ ఏడాది 2.28 కోట్ల కిలోమీటర్లు ఆర్టీసీ బస్సులు తిరిగాయన్నారు. గత ఏడాదితో పోల్చితే 53 లక్షల కిలో మీటర్లను అదనంగా సంస్థ బస్సులను తిపిందని చెప్పుకొచ్చారు. రాఖీ పౌర్ణమికి మహాలక్ష్మి పథకాన్ని మహిళలు పెద్ద ఎత్తున వినియోగించుకుని ఉచితంగా రాకపోకలు సాగించడంపై రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సైతం హర్షం వ్యక్తం చేశారు.

**మంత్రి పొన్నం హర్షం..**

అన్నాచెల్లెల్ల బంధం ఎంత గొప్పదో ఈ రాఖీ గణాంకాలు తెలియజేస్తున్నాయన్నారు. సంస్థ సామర్థ్యాన్ని అంతా ఉపయోగించుకుని రాఖీ పండుగకు రికార్డుస్థాయిలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేసిన ఆర్టీసీ అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. రాఖీ పండుగను త్యాగం చేసి, భారీ వర్షాల్లోనూ నిబద్ధత, అంకితభావం, క్రమశిక్షణతో పనిచేశారంటూ ప్రశంసించారు. రద్దీలోనూ మహాలక్ష్మిమహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్య పథకాన్ని విజయవంతంగా అమలు చేశారన్నారు. ముందస్తు ప్రణాళికతో పాటు సిబ్బంది నిబద్ధతతో పనిచేయడం వల్లే రాఖీ పండుగకు లక్షలాది మంది ప్రయాణికులను క్షేమంగా సిబ్బంది గమ్యస్థానాలకు చేర్చారని టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ తెలిపారు. ఈ రాఖీ పండుగ ఆపరేషన్స్ సంస్థలో సరికొత్త రికార్డులను నమోదు చేసిందని, ఈ నెల 11న ఒక్క రోజులో అత్యధికంగా 68.45 లక్షల మంది ప్రయాణించారని చెప్పారు.

OPINION ఒపీనియన్

# ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదం






- పాతులోతు పాండు నాయక్
9885333196

ప్రజాస్వామ్య వ్యవస్థలో, ప్రజలు ఓటు హక్కును కేవలం ఒక హక్కుగానే కాకుండా, తమ భవిష్యత్తును నిర్ణయించుకునే ఒక శక్తివంతమైన సాధనంగా చూస్తారు. ప్రజాస్వామ్యం అంటే ప్రజల ద్వారా, ప్రజల కోసం, ప్రజలే నడిపే ప్రభుత్వం. ఈ వ్యవస్థలో పౌరులందరికీ తమ ప్రభుత్వాన్ని ఎన్నుకునే హక్కు ఉంటుంది. "ప్రభుత్వాన్ని తమకు జవాబుదారీగా ఉంచగలమనే నమ్మకంతోనే ప్రజలు పోలింగ్ కేంద్రాలకు వస్తున్నారు. అలా వచ్చి లైన్లో నిలబడి ఓటు హక్కును వినియోగంచడం చూస్తే ప్రజలకు ప్రజాస్వామ్య వ్యవస్థపై వారికి ఉన్న విశ్వాసాన్ని స్పష్టం చేస్తుంది. ఓటు హక్కు అనేది కేవలం ఒక సంఖ్య కాదు, అది దేశ భవిష్యత్తును నిర్ణయించే శక్తి. అందుకే ప్రజాస్వామ్యానికి ఓటు హక్కును మూలస్తంభంగా పరిగణిస్తారు.

ఐదేళ్లకు ఒకసారి వచ్చే ఎన్నికల ద్వారా ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారు. హామీలు నెరవేర్చకపోతే, ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తే, ప్రజలు తమ ఓటు ద్వారా తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తారు. ఓటు హక్కు అనేది సాధారణ పౌరుడికి రాజ్యాధికారంలో భాగమయ్యే అవకాశాన్ని ఇస్తుంది. ఒక పౌరుడు వేసే ఒక్క ఓటు కూడా ప్రభుత్వ విధానాలను, నిర్ణయాలను ప్రభావితం చేస్తుంది. ఓటు అనేది సామాజిక మార్పుకు ఒక శక్తివంతమైన సాధనం. సరైన నాయకులను ఎన్నుకోవడం ద్వారా సమాజంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేయవచ్చు. ఎన్నికలలో ఓడిపోతామన్న భయం ప్రభుత్వాలను ప్రజల సంక్షేమం కోసం పని చేసేలా ప్రోత్సహిస్తుంది. ప్రభుత్వం తమ పాలనలో చేసిన మంచి, చెడు పనులకు ప్రజలు ఇచ్చే జవాబు. ఓటర్లు తమ నాయకులను ప్రశ్నించే అధికారాన్ని కలిగి ఉంటారు. తమకు నచ్చని విధానాలపై అసంతృప్తిని వ్యక్తం చేయవచ్చు. ఎన్నికల సమయంలో ఈ అధికారం మరింత బలంగా మారుతుంది. ప్రజలు తమ ఓటు ద్వారా ఒక ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావచ్చు, లేదా అధికారం నుంచి తొలగించవచ్చు. ఈ నిర్ణయాధికారం ప్రభుత్వాలను ప్రజల సంక్షేమం కోసం పని చేసేలా ప్రేరేపిస్తుంది.

సాధారణంగా ఈ ప్రక్రియ ఓటర్ల జాబితా సవరణలో భాగంగా జరుగుతుంది. కానీ కొన్ని సందర్భాల్లో ఈ తొలగింపు ప్రక్రియ సక్రమంగా జరగకపోవడం వలన వివాదాలు తలెత్తుతాయి. అయితే, ఇటీవల కాలంలో ఓటర్ల జాబితా నుంచి పెద్ద సంఖ్యలో పేర్లను తొలగించడం వంటి సంఘటనలు ఈ నమ్మకానికి సవాలు విసురుతున్నాయి. పోలింగ్ బూత్‌లకు వెళ్లిన తర్వాత తమ పేరు జాబితాలో లేదని తెలుసుకున్నప్పుడు, ప్రజల నమ్మకం దెబ్బతింటుంది. "ప్రభుత్వాన్ని జవాబుదారీగా ఉంచాలనుకునే ప్రజల ఆశలు నిరాశగా మారుతున్నాయి. ఓటు వేయడానికి అన్ని ఏర్పాట్లు చేసుకుని వచ్చిన పౌరుడు, తన ఓటు లేదని తెలుసుకున్నప్పుడు తీవ్ర నిరాశకు లోనవుతాడు. తాను ప్రశ్నించాలనుకున్న ప్రభుత్వాన్ని ప్రశ్నించే అవకాశం కోల్పోయినప్పుడు నిస్సహాయత భావం కలుగుతుంది. ఇలాంటి సంఘటనలు తరచుగా జరిగితే, ఎన్నికల ప్రక్రియ పారదర్శకతపై, మొత్తం ప్రజాస్వామ్యంపైనే ప్రజలకు నమ్మకం సన్నగిల్లుతుంది.

ఈ పవిత్రమైన హక్కును కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్, ప్రభుత్వాలపై ఉంది. కానీ ఇటీవల కాలంలో ఓటర్ల జాబితాల నుంచి లక్షల సంఖ్యలో పేర్లను తొలగించడం ద్వారా ఈ హక్కును కాలరాస్తున్నారన్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. సరైన నోటీసు ఇవ్వకుండా పేర్లు తొలగించడం, ఎన్నికల రోజున తమ ఓటు లేదని తెలుసుకున్న ప్రజల నిరాశ ప్రజాస్వామ్యంపై నమ్మకాన్ని సన్నగిల్లజేస్తుంది. ఓటర్ల జాబితా సవరణ అనేది ఒక సాధారణ ప్రక్రియ అయినప్పటికీ, బీహార్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో జరిగిన సంఘటనలు దీనికి నిదర్శనం. తెలంగాణలో 2018 ఎన్నికల సమయంలో ఇది పెద్ద వివాదంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 22 లక్షల మంది అర్హులైన ఓటర్లకు సరైన నోటీసులు ఇవ్వకుండానే వారి పేర్లు తొలగించారు. ఈ వివాదం తీవ్రతరం కావడంతో, అప్పటి తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి రజత్ కుమార్ సరిగ్గా పరిశీలన చేయకుండా, కొన్ని తప్పులు జరిగాయని ఆయన మీడియా సమావేశంలో భవిష్యత్తులో ఇలాంటి తప్పులు జరగకుండా చూస్తామని, రాబోయే పార్లమెంటు ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితాను మరింత జాగ్రత్తగా, పారదర్శకంగా సవరిస్తామని ఆయన ప్రజలకు క్షమాపణలు చెప్పారు. ఈ సంఘటన భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఒక ముఖ్యమైన ఉదాహరణగా నిలిచిపోయింది. ఓటు హక్కు అనేది ఎంత పవిత్రమైనదో, దానిని కాపాడటంలో అధికారులు ఎంత బాధ్యతగా ఉండాలో ఈ సంఘటన గుర్తుచేస్తుంది. ప్రజల ఓటు హక్కును నిర్లక్ష్యం చేయడం అనేది రాజకీయాలకు అతీతంగా, ప్రజాస్వామ్య వ్యవస్థకే పెను ప్రమాదం. ఓటు అనేది కేవలం ఒక హక్కు మాత్రమే కాదు, అది ప్రతి పౌరుడి పవిత్రమైన బాధ్యత. దానిని కాపాడటంలో ప్రభుత్వాలు, ఎన్నికల కమిషన్ విఫలమైతే, ప్రజాస్వామ్యానికి తీరని నష్టం వాటిల్లుతుంది.

భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎన్నికల ప్రక్రియే పునాది. ఆ పునాదిని కదిలించేలా ఉన్న ఈ ఓట్ల సవరణ జాబిత ప్రక్రియను ఒక సున్నితమైన అంశం. ఈ అంశం ఇప్పుడు జాతీయస్థాయిలో పెద్ద చర్చకు దారి తీసింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా ప్రతిపక్షాలు ఈ అంశాన్ని ప్రధానంగా లేవనెత్తాయి. పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లను సరైన సమాచారం లేదా నోటీసు లేకుండా తొలగించడాన్ని తీవ్రంగా ఖండిస్తూ, ఈ విషయంపై చర్చ జరపాలని డిమాండ్ చేశాయి. ఈ డిమాండ్ అధికార పక్షానికి తలనొప్పిగా మారింది. ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు మూలస్తంభం. ఎన్నికల సంఘం నిర్లక్ష్యం కారణంగా లక్షల మంది ప్రజలు తమ ప్రాథమిక హక్కును కోల్పోయారు. ఓటర్ల జాబితా సవరణ అనేది ఒక సాధారణ ప్రక్రియ. అయినప్పటికీ సాధారణంగా ఓటర్ల జాబితా సవరణలో భాగంగా చనిపోయినవారి పేర్లు, ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఉన్న పేర్లు లేదా చిరునామా మార్చుకున్నవారి పేర్లను తొలగిస్తారు. కానీ ఈ మధ్యకాలంలో ఈ ప్రక్రియలో సరైన పారదర్శకత లేదని, దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ పేరుతో జరుగుతున్న ఓట్ల తొలగింపు ప్రక్రియ ఇప్పుడు తీవ్ర రాజకీయ వివాదంగా మారింది. ఇది కేవలం సాంకేతికపరమైన అంశం కాదని, ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేసే ఒక కుట్ర అని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ముఖ్యంగా బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రతిపక్ష పార్టీల సంప్రదాయ ఓట్లను ఉద్దేశపూర్వకంగా తొలగించి, తమ ఓటు బ్యాంకును పెంచుకోవడానికి బీజేపీ 'ఓట్ల దొంగతనానికి పాల్పడిందని ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇటీవల జరుగుతున్న సంఘటనలు, గణాంకాలను పరిశీలిస్తే ఈ ఆరోపణలు నిజమేనని భావించక తప్పదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. లక్షల సంఖ్యలో ఓటర్ల పేర్లు సరైన నోటీసు లేకుండా, నిర్లక్ష్యంగా తొలగించబడ్డాయి. చనిపోయినవారు, చిరునామా మార్చుకున్నవారి పేర్లను తొలగించడంలో భాగంగా జరిగిన ఈ ప్రక్రియ అనేక మంది అర్హులైన ఓటర్ల ఓటు హక్కును కాలరాసింది. పోలింగ్ బూత్‌లకు ఉత్సాహంగా వెళ్లిన ఓటర్లు, తమ పేరు జాబితాలో లేదని తెలుసుకుని తీవ్ర నిరాశకు గురయ్యారు. ఈ సంఘటనలు ఎన్నికల సంఘం నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించింది.

నియమాల ప్రకారం, ఒక ఓటరు పేరును తొలగించే ముందు, ఎన్నికల అధికారులు వారికి నోటీసు ఇవ్వాలి. చాలా సందర్భాల్లో ఈ నిబంధనను పాటించకుండానే నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఓట్ల తొలగింపు ప్రక్రియలో జరిగిన నిర్లక్ష్యం సామాన్య ప్రజలతో పాటు ప్రముఖులను కూడా ఆశ్చర్యపరిచింది. ఈ నిర్లక్ష్యం వెనుక రాజకీయ కుట్ర ఉందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. బీజేపీ అధికార పక్షాలు తమ ప్రత్యర్థులకు చెందిన సంప్రదాయ ఓట్లను ఉద్దేశపూర్వకంగా తొలగించాయని వారు వాదిస్తున్నారు. ఈ ఆరోపణలు, ఎన్నికల ప్రక్రియ యొక్క పవిత్రతపై ప్రజల్లో అనుమానాలను పెంచాయి. బీహార్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఈ తొలగింపులు ఆయా ప్రాంతాల ప్రజల్లో ఎన్నికల ప్రక్రియపై నమ్మకాన్ని సన్నగిల్ల చేశాయి. తెలంగాణలో జరిగిన 2018 ఎన్నికల సమయంలో, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి జ్వాలా గుత్తా వంటివారు తమ ఓటు హక్కును వినియోగించుకోలేకపోయారు. ఆమెకు హైదరాబాద్‌లో ఓటు ఉన్నప్పటికీ, జాబితాలో ఆమె పేరు కనిపించలేదు. దీని వల్ల ఓటర్లకు తమ పేరు తొలగించబడిందన్న విషయం ఎన్నికల రోజున మాత్రమే తెలిసింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, వలస కార్మికులు, పేద వర్గాలకు చెందిన ఓటర్లు ఈ సమస్యతో ఎక్కువగా బాధపడ్డారు. ఈ సంఘటన ఎన్నికల కమిషన్ నిర్లక్ష్యం ఎంతవరకు ఉందో స్పష్టం చేస్తుంది. ఒక ప్రముఖ క్రీడాకారిణికి ఈ పరిస్థితి ఎదురైతే, సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు తలెత్తాయి. ఈ విషయం రాజకీయంగా, సామాజికంగా పెద్ద చర్చకు దారితీసింది.

ఈ సందర్భంలో ఇండియా కూటమి ఈ సమస్యను కేవలం ఒక రాష్ట్రానికి చెందినదిగా కాకుండా, దేశ వ్యాప్తంగా ప్రజాస్వామ్యానికి కలిగిన ఒక ముప్పుగా భావిస్తోంది. ఓటర్ల జాబితా సవరణ పేరుతో అధికార పక్షాలు తమ ఓటు బ్యాంకును పెంచుకోవడానికి ప్రయత్నిస్తున్నాయని కూటమి ఆరోపిస్తోంది. ఈ ఆరోపణలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడానికి ఒక ఉద్యమాన్ని ప్రారంభించింది. ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో తనిఖీ చేసుకోవడం ఎంత ముఖ్యమో ప్రజలకు తెలియజేయడానికి 'ఇండియా' కూటమి దేశ వ్యాప్తంగా ప్రజాస్వామ్యానికి మూల స్తంభమైన ఓటు హక్కుపై జరుగుతున్న ఈ దాడిని పార్లమెంట్‌లో చర్చకు తీసుకురావడం ద్వారా, ఈ సమస్యకు ఒక జాతీయ స్థాయి గుర్తింపు తీసుకురావాలని కూటమి ప్రయత్నిస్తోంది. బీజేపీ దొడ్డి దారిన, దొంగ ఓట్లతో మూడుసార్లు అధికారంలోకి వచ్చిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు దేశ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఓటర్ల జాబితా నుంచి ప్రతిపక్షాల సంప్రదాయ ఓట్లను తొలగించి, తమ అధికారాన్ని దుర్వినియోగం చేస్తోందని ఆయన తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఓటు అనేది రాజ్యాంగం కల్పించిన బలమైన ఆయుధం. అయితే, బీజేపీ ఈ ఆయుధాన్ని కూడా దొంగిలించి, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటు హక్కుపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీసే విధంగా బీజేపీ వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. ఓట్ల తొలగింపు అనేది కేవలం ఒక సాంకేతిక లోపం కాదు, ఇది ప్రజల ప్రాథమిక హక్కులపై జరుగుతున్న దాడి. ఈ అంశాన్ని 'ఇండియా' కూటమి ఒక ఉద్యమంగా మార్చడం ద్వారా, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా నివారించాలనే లక్ష్యంతో ఉంది. ఈ ఉద్యమం, పార్లమెంట్‌లో జరగబోయే చర్చ, మరియు ఈ విషయంపై ఎన్నికల కమిషన్ తీసుకునే చర్యలు భారత ప్రజాస్వామ్య భవిష్యత్తును నిర్ణయించగలవు.

ప్రతిపక్షాల డిమాండ్ అధికార పక్షానికి తలనొప్పిగా మారింది. ఓటర్ల జాబితా సవరణ అనేది ఎన్నికల కమిషన్ పరిధిలోని అంశమని ప్రభుత్వం వాదిస్తున్నప్పటికీ, ఈ విషయంపై పెరుగుతున్న ప్రజాగ్రహం మరియు ప్రతిపక్షాల ఐక్యత ప్రభుత్వాన్ని ఇబ్బంది పెడుతున్నాయి. తెలంగాణలో జరిగిన సంఘటనలో ఎన్నికల కమిషన్ క్షమాపణలు చెప్పడం, ఈ అంశంపై ప్రతిపక్షాల వాదనకు బలం చేకూరుస్తోంది. ఈ మొత్తం వ్యవహారంలో ఎన్నికల సంఘంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఓటరు హక్కులను కాపాడాల్సిన ఎన్నికల సంఘం, తన బాధ్యతను సక్రమంగా నిర్వహించడంలో విఫలమైందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. తెలంగాణలో అప్పటి ఎన్నికల అధికారి క్షమాపణలు చెప్పినా, ఇతర రాష్ట్రాల్లో ఇలాంటి పొరపాట్లు జరగకుండా నివారించడంలో ఎన్నికల కమిషన్ తీసుకున్న చర్యలు అంతంత మాత్రమేనని విమర్శలు వస్తున్నాయి. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా, ఎన్నికల సంఘం మరింత బాధ్యతాయుతంగా, పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు మూలస్తంభం అయితే, ఆ హక్కును ఉపయోగించుకోవడానికి ప్రజల్లో ఉన్న నమ్మకం ఆ మూలస్తంభానికి ఊపిరి వంటిది. ఆ నమ్మకం సన్నగిల్లితే, ప్రజాస్వామ్య వ్యవస్థ బలహీనపడుతుంది. ఎన్నికల కమిషన్, ప్రభుత్వాలు ఈ నమ్మకాన్ని కాపాడాల్సిన బాధ్యతను గుర్తించాలి. ప్రతి ఓటరు తన ఓటు హక్కును నిర్భయంగా, నమ్మకంగా ఉపయోగించుకోగలిగినప్పుడే ప్రజాస్వామ్యం పరిపూర్ణంగా ఉంటుంది. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ మరింత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగాల్సిన అవసరం ఉంది. లేకపోతే ప్రజలకు ఎన్నికల ప్రక్రియపై నమ్మకం సన్నగిల్లి, ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదం ఏర్పడుతుంది.

రచనలకు ఆహ్వానం
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
74369 39999

## పాత జ్ఞాపకంగా మిగలనున్న రిజిస్టర్డ్ పోస్ట్

ఒకప్పుడు ప్రజల హృదయాలకు దగ్గరగా ఉన్న సేవలలో "రిజిస్టర్డ్ పోస్ట్" ఒకటి. భారతదేశంలో ఒకప్పుడు అత్యంత ప్రాముఖ్యత కలిగిన కమ్యూనికేషన్ వ్యవస్థల్లో రిజిస్టర్డ్ పోస్ట్ ఒకటి. సెప్టెంబర్ 1 నుండి మన దేశంలో రిజిస్టర్డ్ పోస్ట్ సేవలను తపాలా శాఖ నిలిపివేయనుంది.మన లాంటి అధిక విస్తీర్ణ దేశంలో, ముఖ్యమైన సమాచారం భద్రంగా, నిర్దిష్ట వ్యక్తికి చేరేలా చూసే మార్గంగా రిజిస్టర్డ్ పోస్ట్ వ్యవస్థ ముఖ్యమైన పాత్ర వహించింది. ప్రభుత్వ వ్యవహారాలు, కోర్టు నోటీసులు, ఉద్యోగ నియామక పత్రాలు మొదలైనవన్నీ ఈ విధానంలోనే పంపడమవుతుండేది. రిజిస్టర్డ్ పోస్ట్ అనేది కేవలం ఒక లేఖను పంపే మార్గం మాత్రమే కాదు. అది ప్రభుత్వ న్యాయ పరిరక్షణకు అనుగుణంగా ఉండే విశ్వసనీయ వ్యవస్థగా నిలిచింది.రాజ్యాంగం అమలులోకి వచ్చిన తరువాత నుంచి ప్రభుత్వ విభాగాలు, న్యాయస్థానాలు, పాఠశాలలు, బ్యాంకులు మరియు ఇతర శాసన సంస్థలు అత్యవసరమైన పత్రాలు పంపించేందుకు రిజిస్టర్డ్ పోస్ట్‌ను ప్రధానంగా ఉపయోగించేవి.ప్రైవేట్ కొరియర్ సంస్థలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. బ్లూ డార్ట్, డిటిడిసి, ఫెడ్ఎక్స్ వంటి సంస్థలు అధునాతన ట్రాకింగ్ సిస్టమ్‌లు, వేగవంతమైన డెలివరీ సేవలతో ప్రజలకు సౌలభ్యం కలుగజేస్తున్నాయి. ఇటువంటి వేగవంతమైన, యూజర్ ఫ్రెండ్లీ సేవల సమక్షంలో ప్రభుత్వ రిజిస్టర్డ్ పోస్ట్ సేవల వాడకం తక్కువవుతోంది. ఫలితంగా పోస్ట్ ఆఫీసుల్లో ఈ సేవలు మరింత తగ్గుతున్నాయి.2000ల దశకంలో పోస్టాఫీసు సేవల్లో దీని వాడకం గణనీయంగా ఉండేది. భారత ప్రభుత్వ గణాంకాల ప్రకారం 200708లో దేశవ్యాప్తంగా రూ. 2.1 కోట్లకు పైగా రిజిస్టర్డ్ పోస్ట్ లావాదేవీలు జరిగినట్లు రికార్డులున్నాయి.2020 తర్వాత ఈ గణాంకాలు తగ్గాయి. ఇండియా పోస్ట్ వార్షిక నివేదిక ప్రకారం, 202223 నాటికి రిజిస్టర్డ్ పోస్టుల సంఖ్య రూ. 40 లక్షలకు దిగజారింది. ఇది గత 15 సంవత్సరాల్లో దాదాపు 80% తగ్గుదలకు సంకేతం. ఈ తగ్గుదల వెనుక కారణాలు అనేకం – టెక్నాలజీ విప్లవం, ప్రైవేట్ కొరియర్ సేవల పెరుగుదల, ప్రభుత్వ రంగ సంస్థలు కూడా తమ అంతర్గత కమ్యూనికేషన్ విధానాల్లో మార్పులు చేసుకున్నాయి. ఉదాహరణకు, భారత న్యాయవ్యవస్థ ఇప్పుడిప్పుడే ఈకోర్టు వ్యవస్థ ద్వారా కేసుల సమాచారం పంపడాన్ని ప్రోత్సహిస్తోంది. ఈ సర్వీస్ ఆఫ్ నోటీసులు ద్వారా కోర్టులు కూడా రిజిస్టర్డ్ పోస్ట్‌ను బదులుగా ఈమెయిల్ లేదా మెసేజ్ ద్వారా సమాచారాన్ని పంపడం ప్రారంభించాయి. ఇది కూడా ఈ సేవల అవసరాన్ని మరింతగా తగ్గిస్తోంది.దేశంలోని 1.55 లక్షల పోస్టాఫీసుల్లో కనీసం 60% పోస్టాఫీసులు ఇప్పుడు రిజిస్టర్డ్ పోస్ట్‌కు బదులుగా స్పీడ్ పోస్ట్ లేదా పార్శిల్ సేవలపై దృష్టి సారిస్తున్నాయి. స్పీడ్ పోస్ట్ ద్వారా పత్రాలు వేగంగా పంపించవచ్చు. ఆన్‌లైన్ ట్రాకింగ్ మెరుగ్గా ఉంటుంది. ఫలితంగా ప్రజలు స్పీడ్ పోస్ట్ వైపు మొగ్గుచూపుతున్నారు. భారత్‌లో ఇంటర్నెట్ వినియోగ దారుల సంఖ్య 90 కోట్లకు చేరకుంది. ఈ విస్తరణ కూడా డిజిటల్ కమ్యూనికేషన్‌ను మరింత బలోపేతం చేసింది. ముఖ్యమైన డాక్యుమెంట్లు పంపే అవసరం ఉన్నా, ఇప్పుడు వాటిని స్కాన్ చేసి ఇమెయిల్ ద్వారా పంపించడం చాలా వేగంగా, సులభంగా మారింది.ఈమెయిల్, ఇసైన్, ఆధార్ ఆధారిత ఈకెవైసీ, డిజిటల్ డాక్యుమెంట్ పోర్టల్స్, న్యాయస్థానాల్లో వర్చువల్ ఫైలింగ్ విధానాల వల్ల రిజిస్టర్డ్ పోస్ట్ సేవ తక్షణమే అవసరంలేని పాత పద్ధతిగా మారిపోయింది.రిజిస్టర్డ్ పోస్ట్‌ను ఇకపై పెద్దగా వాడుకునే అవసరం లేకుండా మారుతుంది. అయితే అది చేసిన సేవలు, ఆ సేవల ద్వారా ఏర్పడిన అనుబంధాలు మాత్రం ఎన్నటికీ మరువలేం. ఇది కేవలం ఒక పోస్ట్ విధానం కాదు, ఒక యుగానికి నిదర్శనం.

- పిన్నింటి బాలాజీ రావు,
హనుమకొండ,
9866776286



# గ్రామీణ మారుమూల ప్రాంతాలలో కార్మెల్ పాఠశాల సేవలు ప్రశాంశనీయం

## విద్యాలయాలను మెరుగుపరిచేందుకు పదివేల మందిని భర్తీ చేశాం

## రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనులు భూగర్భ శాఖామంత్రి గడ్డం వివేకానంద



**మందమర్రి, మహా :** గ్రామీణ మారుమూల ప్రాంతాలలో కార్మెల్ పాఠశాల సేవలు ప్రశాంశనీయం రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనులు భూగర్భ శాఖామంత్రి గడ్డం వివేకానంద వాక్యానించారు. బుధవారం మందమర్రి మండల కేంద్రంలో కార్మల్ డిగ్రీ కళాశాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, ఫాదర్ ఫిలిప్ లతో కలిసి హాజరై కళాశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యం కోసం సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి విద్యార్థి చదువుకునేందుకు ప్రభుత్వం అవకాశాలు కల్పిస్తూ ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఉన్నత విద్యతో సమాజంలో గౌరవం పెరుగుతుందని, మనిషి దైనందిన జీవితంలో చదువు ఎంతో ఆవశ్యకమని తెలిపారు. బాల్యం నుండి నేర్చుకున్న సంస్కారం, చదువుతో భవిష్యత్తు వాటిల్లుతుందని స్పష్టం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 10 వేల మంది నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించిందని చెప్పారు. మంచిర్యాల జిల్లా కలెక్టర్ నేతృత్వంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ మందమర్రి మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ప్రారంభించడం సంతోషంగా ఉందని వెల్లడించారు. పరిశ్రమల నిర్వహణకు మానవ శక్తి అవసరమని, ఇందుకు గాను ప్రభుత్వం పారిశ్రామక శిక్షణ సంస్థ లను అభివృద్ధి చేస్తూ జిల్లాలో 4 అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేసి శిక్షణ అందిస్తుందని తెలిపారు. టాటా సంస్థ సమన్వయంతో ఆర్టీఫీషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ ఇతర అధునాతన సాంకేతికత కలిగిన కోర్సులను శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. చెన్నూర్ మండలం సోమనపల్లిలో 200 కోట్ల రూపాయల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని చెప్పారు. 2047 నాటికి తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు అందరం సమిష్టిగా కృషి చేయవలసిన అవసరం ఉందని తెలిపారు. మందమర్రి మండల కేంద్రంలో కార్మెల్ పాఠశాల సేవలు అమోఘమని ప్రశంసించారు. కార్మెల్ పాఠశాలను ప్రారంభించి 63 సంవత్సరాలు అవుతుందని వివరించారు. ఈ పాఠశాలలో విద్యను అభ్యసించిన విద్యార్థులు వివిధ రాష్ట్రాలతో పాటు వివిధ విదేశాలలో కూడా ఉద్యోగాలు నిర్వహించడం మామూలు విషయం కాదని ఆయన పేర్కొన్నారు. కార్మెల్ పాఠశాలలో విద్య అతి తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్యను సంస్థ అందిస్తుందని వివరించారు.

# భారీ వర్షా ల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి :జిల్లా కలెక్టర్



**భూపాలపల్లి, మహా :** అధికారులు క్షేత స్థాయిలో అధికారులు అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం ఐడిఓసి కార్యాలయం నుండి ఎస్పి కిరణ్ ఖరే తో కలిసి రెవెన్యూ, పంచాయతి రాజ్, ఇరిగేషన్, వైద్య, విద్యుత్తు, వ్యవసాయ, ఆర్ అండ్ బి, మున్సిపల్ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 72 గంటల పాటు భారీ వర్షాలు వచ్చే అవకాశం ఉన్న సందర్భంగా ప్రజలు బయటికి రాకుండా ఇంటిపట్టునే ఉండేలా గ్రామాలు, మున్సిపాలిటీలో టాంటాం వేయించాలని ఆదేశించారు. ఏ సమయంలో క్లౌడ్ బరెస్ట్ అయ్యే అవకాశం ఉందని అన్ని శాఖల అధికారులు గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు జిల్లాకు వాతావరణ శాఖ సూచన మేరకు భారీ వర్ష సూచన వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన 9030632608 కంట్రోల్ రూము నంబర్ కుఫోన్ చేయాలని ప్రజలకు సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను అన్ని శాఖల అధికారులు తప్పక పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ప్రతీ శాఖ అధికారులు, సిబ్బంది వారి పరిధిలో గల విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కాజ్ వే లపై ప్రజలు ప్రయాణం చేయకుండా నిలుపుదల చేయాలని భారీ కేడింగ్, ట్రాక్టర్లు అడ్డు పెట్టాలని పోలీస్, రెవెన్యూ, పంచాయతి, ఆర్ అండ్ బి సిబ్బంది పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. చెరువులు తెగే పరిస్థితి ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు అధికారులు, సిబ్బంది కార్యస్థానాల్లో అందుబాటులో ఉండి ప్రజలకు ఎలాంటి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు ఎస్పి కిరణ్ ఖరే మాట్లాడుతూ అకస్మాత్తుగా వర్షం వచ్చే అవకాశం ఉన్న దృష్ట్యా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. 25మంది ఎన్ డిఆర్ ఎఫ్ సిబ్బంది సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఎలాంటి సమస్యలు వచ్చిన ఎదుర్కొడానికి యంత్రాంగం సంసిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఇరిగేషన్, విద్యుత్తు, పంచాయతీరాజ్, వైద్య, మత్స్య శాఖ, అధికారులతో పాటు అన్ని మండలాల తహసిల్దారులు, ఎంపీడీఓలు, డివిజన్ అధికారు లు తదితరులు పాల్గొన్నారు.




# ఈనెల 17 నుండి కాజీపేట దర్గా ఉర్సు ఉత్సవాలు

## ఉర్సు ఉత్సవాల నిర్వహణపై కలెక్టరేట్ లో సమావేశం

**హన్మకొండ మహా;** ఈనెల 17వ తేదీ నుండి 22వ తేదీ వరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహించే కాజీపేట దర్గా ఉర్సు ఉత్సవాలకు వరంగల్ మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాట్లను చేస్తున్నట్లు మేయర్ గుండు సుధారాణి తెలిపారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో కాజీపేట దర్గా ఉర్సు ఉత్సవాల ఏర్పాట్లు, నిర్వహణ, బందోబస్తు, తీసుకోవాల్సిన ఇతర జాగ్రత్తలపై మేయర్, గ్రేటర్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, డిఆర్ఓ వై.వి.గణేష్, హనుమకొండ ఆర్డిఓ రాథోడ్ రమేష్, కాజీపేట ఏసిపి ప్రశాంత్ రెడ్డి, జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ గౌస్ హైదర్, కాజీపేట దర్గా పీఠాధిపత ఖుస్రూ పాషా, వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా ఉర్సు ఉత్సవాల ఏర్పాట్లు, నిర్వహణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దర్గా పీఠాధిపతి, మేయర్, గ్రేటర్ కమిషనర్, ఇతర శాఖల అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా నగర మేయర్, కమీషనర్ మాట్లాడుతూ కాజీపేట దర్గా ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందు మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో రోడ్ల మరమ్మతులు, విద్యుత్ దీపాల అలంకరణ, జనరేటర్, తదితర ఏర్పాట్లతో పాటు తాగునీటి సౌకర్యాన్ని కల్పిస్తామని, పారిశుద్ధ్య నిర్వహణ ఎప్పటికప్పుడు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ కాజీపేట దర్గా ఉర్సు ఉత్సవాల సందర్భంగా ఎక్కడ కూడా ఇబ్బందులు లేకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని ముఖ్యంగా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో కాజీపేట డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఇతర శాఖల, అధికారులు, పాల్గొన్నారు.

# కాటారంలో వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు...



**కాటారం, మహా :** కాటారం మండల కేంద్రంలోని ఆదర్శ హై స్కూల్లో బుధవారం ముందస్తుగా కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు వేసిన గోపికలు, శ్రీకృష్ణుడి వేషధారణలతో పలువురిని ఆకట్టుకున్నాయి. ఉట్టికొట్టే కార్యక్రమంలో చిన్నారులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకు న్నాయి. ఈ కార్యక్రమంలో చైర్మన్ జనగామ కరుణాకర్ రావు, కరస్పాండెంట్ జనగామ కార్తీక్ రావు, ప్రిన్సిపాల్ కృషిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

# సైలెన్సర్లు మార్పు చేస్తే క్రిమినల్ కేసులు

## ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ




**హన్మకొండ మహా;** సైలెన్సర్లు మార్పు చేసి శబ్ద కాలుష్యం చేస్తూ వాహనం నడిపితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని గ్రేటర్ వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ హెచ్చరించారు. వరంగల్ ట్రై సిటీ లోని వరంగల్, హన్మకొండ, కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లతో రాకెట్ నమూనాతో వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయం ట్రాఫిక్ జంక్షన్ లో ఏర్పాటు చేసిన పైలాన్ బుధవారం ట్రాఫిక్ ఏసీపీ ఆవిష్కరించారు. అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లను అమర్చుకోవడం నేరమని యువతకు గుర్తు చేసేందుకుగాను స్వాధీనం చేసుకున్న సైలెన్సర్లతో రాకెట్ పైలాన్ ఏర్పాటు చేయడం జరిగిందని ఇప్పటి వరకు ట్రై సిటీ పరిధిలో 2024 సంవత్సరంలో మొత్తం 1246 సైలెన్సర్లను స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఇందులో హన్మకొండలో 557, వరంగల్ 335, కాజీపేట లో 354 సైలెన్సర్లను ట్రాఫిక్ పోలీసులు స్వాధీనం చేసుకోగా, 2025 ప్రారంభం నుండి ఇప్పటి వరకు ట్రాఫిక్ పోలీసులు 592 సైలెన్సర్లను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో హన్మకొండ 242, వరంగల్ 85, కాజీపేట లో 265 సైలెన్సర్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఏసీపీ పేర్కొన్నారు. ఈ పైలాన్ ఆవిష్కరణ కార్యక్రమంలో హన్మకొండ ట్రాఫిక్ ఇన్స్ స్పెక్టర్ సీతారెడ్డి పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు భరోసా కల్పించాలి

## ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలి

## జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరె



**కాటారం, మహా :** ప్రజలకు అందుబాటులో ఉంటూ, పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు భరోసా కల్పించే విధంగా పనిచేయాలని సూచించారు. భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖేరే అన్నారు. బుధవారం వార్షిక తనిఖీలో భాగంగా కొయ్యూరు పోలీసు స్టేషన్ ను ఎస్పీ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ స్టేషన్ సిబ్బంది పనితీరును, వివిధ రకాల రికార్డ్స్ పరిశీలించడంతో పాటు, వివిధ ఫిర్యాదులపై చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్ లో ఉన్న సిడి ఫైల్స్ ను, పెండింగ్ ట్రాయల్లో ఉన్న సిడి ఫైళ్లను, గ్రేవ్ కేసెస్ లలో ఉన్న సిడి ఫైళ్లను పరిశీలించారు. నిందితుల అరెస్ట్, కోర్ట్ లో పెండింగ్ లో వున్న కేసులు, వాటికి సంబందించిన దర్యాప్తు వివరాలను, రోడ్డు ప్రమాదాల నివారణకు, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, సమస్యత్మక గ్రామాల వివరాలు, ట్రబుల్ మాంగర్స్, వివరాలను ఎస్ ఐ నరేష్ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ కు వచ్చే వారితో అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని, సమస్యతో పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులకు సమస్య పరిష్కారం అవుతుందనే నమ్మకాన్ని భరోసా వారిలో కలిగించాలన్నారు. నేరాల కట్టడి కొసం అధికారులు మరింత శ్రమించడంతో పాటు, నేరం జరిగిన వెంటనే పోలీసులు వేగంగా స్పందించాలని, రానున్న స్థానిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు తగిన చర్యలు చేపట్టాలని, అలాగే అసాంఘిక కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచి, పటిష్ట చర్యలు తీసుకోవాలనీ ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాటారం డిఎస్పీ సూర్యనారాయణ, సీఐ నాగార్జున రావు, ఎస్ ఐ లు మహేంద్ర కుమార్, రజన్ కుమార్, సి సి ఫసీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పారదర్శకంగా ప్రజలకు న్యాయం అందించాలి

## పోలీస్ వ్యవస్థ పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించాలి

## వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్




**వరంగల్ మహా;** పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులకు పోలీస్ అధికారులు పారదర్శకంగా న్యాయం అందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ నల్లబెల్లి పోలీస్ అధికారులకు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ బుధవారం నల్లబెల్లి పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ చేరుకున్న పోలీస్ కమిషనర్ కు పోలీస్ అధికారులు పూలమొక్కలను అందజేసి స్వాగతం పలకగా సాయుధ పోలీసులు సీపీకి గౌరవ వందనం చేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ పోలీస్ సిబ్బంది నిర్వహించిన పరేడ్ తో పాటు కిట్ ఆర్టికల్స్ తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా సీపీ పోలీస్ స్టేషన్ రిసెప్షన్, సిసిటిఎన్ఎస్ విభాగాల పనితీరును సంబంధిత పోలీస్ సిబ్బందిని సిపి అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేయడంతో పాటు, పెండింగ్ కేసులు, కోర్టు కేసులు, ప్రస్తుతం దర్యాప్తులో వున్న కేసులకు సంబంధించి పోలీస్ కమిషనర్ క్షుణ్ణంగా తనిఖీ చేసి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. అలాగే స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లు, అనుమానితులు, కేడీ,డిసిలు, మిస్సింగ్, ఆస్తి నేరాలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించిన పోలీస్ కమిషనర్ సిబ్బందిని శాఖపరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు నమ్మకాన్ని కలిగించడంతో పాటు, పోలీస్ వ్యవస్థ పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించాలంటే ప్రతి పోలీస్ ఉద్యోగి నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహించాలని ప్రజల సమస్యలకు తక్షణ స్పందనతోపాటు, మర్యాదపూర్వకంగా వారి ఫిర్యాదులు ఆలకించాల్సిన బాధ్యత అందరి పై ఉంది అని సీపీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో సీపీ తో పాటు డీసీపీ మొక్కలను నాటారు. ఈ తనిఖీల్లో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్,నర్సంపేట ఏసీపీ రవీందర్ రెడ్డి, దుగ్గొండి సిఐ సాయి రమణ, నల్లబెల్లి, ఖానాపూర్ ఎస్.ఐలు గోవర్ధన్, రఘుపతి పాల్గోన్నారు.

# వేగవంతంగా పన్ను వసూలు చేయండి

## నిర్దేశిత లక్ష్యాలను చేరకుంటే చర్యలు తప్పవు..

## బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్




**వరంగల్ మహా;** వార్డు ఆఫీసర్ లు, బిల్లు కలెక్టర్లు నిర్లక్ష్యాన్ని వీడి అంకితభావంతో పన్ను వసూలు చేయాలని జీ డబ్ల్యు ఎం సి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ఆదేశించారు. బుధవారం బల్దియ ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ లో జరిగిన సమావేశంలో పన్ను వసుల ప్రగతిపై రెవిన్యూ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డు ఆఫీసర్ లు, బిల్లు కలెక్టర్లు ప్రతిరోజు తమకు నిర్దేశించిన పన్ను వసూళ్ల లక్ష్యాన్ని కచ్చితంగా చేరుకోవాలని, పన్ను వసూళ్లలో వెనుకంజలో ఉన్న సిబ్బంది ఆగస్టు 31లోగా పన్ను వసూళ్లలో పురోభివృద్ధి కనిపించాలని లేనిచో చర్యలు తప్పవని, సుదీర్ఘ కాలకంగా పనులు చెల్లించకుండా పెండింగ్ లో ఉన్న వారికి నోటీసులు జారీ చేసి వసూలు జరిగేలా చూడాలని, లేనిచో సంబంధిత యాజమాన్యానికి చెందిన నల్లాలు తీసి వేయడం, డి ఆర్ ఎఫ్ సిబ్బంది సహకారంతో ఆస్తులను జప్తు చేయాలని అన్నారు. వర్క్ ఇన్స్పెక్టర్, డి ఆర్ ఎఫ్ సిబ్బంది డిప్యూటీ కమిషనర్ వార్డు ఆఫీసర్, ఆర్ ఐ, ఆర్ ఓ లు బృందాలుగా ఏర్పడి సమన్వయంతో చాలా సం.ల నుండి చెల్లించకుండా ఉన్న బడా బకాయిదారుల నుండి పన్నులు వసూలు చేయాలని, పన్నుల సేకరణతో పాటు సమాంతరంగా నల్లా పన్నులు వసూలు చేయాలని, ఈ మాసాంతం లోగా నల్లా పన్ను వసూలు 20%, ఆస్తి పన్ను వసూలు 30% కు చేరుకోవాలని కమిషనర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న రాణి, రవీందర్ పన్నుల అధికారి రామకృష్ణ, ఆర్ ఓ లు తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథి టైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్



**భూపాలపల్లి, మహా :** 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్ రాష్ట్ర ప్రభుత్వము ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్ ను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం సూచించింది.వేడుకల కార్యక్రమములో జాతీయ పతాక ఆవిష్కరణ, గౌరవ వందనం, సాంస్కృతిక ప్రదర్శనలు, విశిష్ట సేవలకుగాను అధికారులకు మరియు ప్రజలకు పురస్కార ప్రదానం వంటి కార్యక్రమాలు నిర్వహించబడనున్నాయి.

# స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథి టైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్

**భూపాలపల్లి, మహా :** 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్ రాష్ట్ర ప్రభుత్వము ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్ ను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం సూచించింది.వేడుకల కార్యక్రమములో జాతీయ పతాక ఆవిష్కరణ, గౌరవ వందనం, సాంస్కృతిక ప్రదర్శనలు, విశిష్ట సేవలకుగాను అధికారులకు మరియు ప్రజలకు పురస్కార ప్రదానం వంటి కార్యక్రమాలు నిర్వహించబడనున్నాయి.



### గొల్ల బుద్ధారం పాఠశాలల అభివృద్ధికి చర్యలు

గొల్ల బుద్ధారం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.బుధవారం చికెన్ పల్లి గ్రామంలో నీటి మునిగిన ఇళ్లను, గొల్ల బుద్ధారం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలను పరిశీలించారు. మంగళవారం కురిసిన వర్షాలకు చికెన్ పల్లి గ్రామంలో ఇళ్ళలోకి నీరు చేరిన కుటుంబాల సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రత్యేక కేటగిరి క్రింద ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేస్తామని తెలిపారు. రహదారిపై వరద నీరు చేరకుండా కల్వర్ట్ లు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్ అండ్ బి ఇంజినీరింగ్ అధికారు లను ఆదేశించారు. పంట కాలువలు పిచ్చి మొక్కలతో ఇరుకుగుగా మారడం వల్ల నీరు వెళ్ళడానికి ఆటంకం కలుగుతుందని కాలువలు పరిశుభ్రం చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

### భూపాలపల్లి ప్రధాన ఆసుపత్రి అభివృద్ధికి కృషి

మంగళవారం కురిసిన భారీ వర్షానికి జిల్లా ప్రధాన ఆసుపత్రిలోని పలు వార్డులలోకి వరదనీరు చేరి రోగులు ఇబ్బంది పడిన ఘటనపై బుధవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి జిల్లా ప్రధాన ఆసుపత్రిని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పరిశీలించారు. వైద్యరోగ్య శాఖ ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం వల్లే వర్షపు నీరు చేరిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రి పై అంతస్తు నిర్మాణం జరుగుతున్న క్రమంలో ఇంజనీరింగ్ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా నిర్మాణం చేపట్టడం వలన వరద నీరు ఆసుపత్రి లోని వార్డులలో చేరడం జరిగిందని వెంటనే ఇంజనీరింగ్ శాఖ అధికారులతో ఫోన్ లో మాట్లాడి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు వహించాలని హెచ్చరించారు. అంతే కాకుండా గత ప్రభుత్వం హయాంలో ఆసుపత్రి నిర్మాణం జరిగిందని అప్పుడు ఆసుపత్రి నిర్మాణం తక్కువ ఎత్తులో నిర్మించడం, సరైన జాగ్రత్తలు తీసుకోకుండా సి.సీ నిర్మాణం చేపట్టారని అందువల్ల వరద నీరు ఆసుపత్రి ఆవరణలో చేరుతుందని తెలిపారు. త్వరలోనే ఆసుపత్రి ఆవరణలో గార్డెనింగ్ పనులు చేపట్టి సుందరంగా తీర్చిదిద్దుతామని రోగులు ఎవరు ఆందోళన చెందే అవసరం లేదని అన్నారు. ఆసుపత్రిని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిన్టెన్డెంట్ రాజేంద్ర ప్రసాద్, ఆర్.ఎం.ఓ దివ్య, టి జిఎం ఐడిసి ఏ.ఈ రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయండి

**వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య**



**వరంగల్ మహా;** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కేంద్రీయ విద్యాలయంతో పాటు జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కోరారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలో కేంద్ర పాఠశాల విద్య శాఖ కార్యదర్శి సంజయ్ కుమార్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. భూపాలపల్లి జిల్లాలో సింగరేణి ఉద్యోగులు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగ ఉద్యోగులు, ఐటీ ఉద్యోగులు ఎక్కువగా ఉంటారని, వారి పిల్లలకు నాణ్యమైన విద్య అవసరమని ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. కేంద్రీయ విద్యాలయం వస్తే స్థానిక పిల్లలకు మంచి విద్య అందుతుందన్నారు. ఉద్యోగుల బదిలీల కారణంగా చదువులో అంతరాయం లేకుండా ఉంటుందని ఎంపీ పేర్కొన్నారు. అలాగే జయశంకర్ భూపాలపల్లిలో నవోదయ పాఠశాల ఏర్పాటు చేయాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తి చేశారు. భూపాలపల్లి జిల్లా గ్రామీణ, ఆర్థికంగా వెనుకబడి ఉందని, జిల్లాలో ఇప్పటివరకు నవోదయ పాఠశాల లేకపోవడంతో ప్రతిభావంతులైన పిల్లలు మంచి రెసిడెన్షియల్ విద్యకు దూరమవుతున్నారని ఎంపీ డాక్టర్ కడియం కావ్య విద్యాశాఖ కార్యదర్శి సంజయ్ కుమార్ కు వివరించారు. జిల్లాలో నవోదయ పాఠశాల వస్తే గ్రామీణ పిల్లలకు మంచి అవకాశాలు లభిస్తాయని, జిల్లాలో కేంద్రీయ విద్యాలయం, జవహర్ నవోదయ విద్యాలయం కోసం అవసరమైన స్థలం సదుపాయాలు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆమోదం తెలపాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తి పట్ల సానుకూలంగా స్పందించిన విద్యాశాఖ కార్యదర్శి సంజయ్ కుమార్ కేంద్రీయ విద్యాలయం, జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు.

# తల్లి... దీవించు



**ఆమనగల్లు, మహా :** కడ్తాల మండల కేంద్రంలోని మైసిగండి గ్రామంలో మైసమ్మ బోనాలు బుధవారం అంగరంగ వైభవంగా జరిగాయి. సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా మహిళలు బోనమెత్తి ఊరేగింపు నిర్వహించారు. బోనాల ఊరేగింపులో డప్పు చప్పుళ్లు, డోలు వాయిద్యాల నడుమ శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, యువకుల కేరింతలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మైసమ్మ అమ్మ వారికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి,పిసిసి సభ్యులు అయిల్ల శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో భక్తులు పూజలు నిర్వహించారు. కోరిన కోర్కెలు తీర్చాలని మొక్కులు అమ్మ వారిని సమర్పించుకున్నారు



# ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

**కార్పొరేటర్ తోకల శ్రీనివాసరెడ్డి**

**రాజేంద్రనగర్ మహా ;** రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని, మైలర్ దేవ్ పల్లి డివిజన్ బిజెపి అధ్యక్షులు, గోదా పాండు యాదవ్ ఆధ్వర్యంలో, 15 ఆగస్టు వేడుకలలో భాగంగా, బాబుల్ రెడ్డి నగర్ బొడ్రాయి చౌరస్తాలో, ఆర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి బిజెపి రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్, డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, బిజెపి నాయకులతో కలిసి, బస్తీ వాసులకు జాతీయ జెండా అందజేశారు. సందర్భంగా మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 11 సంవత్సరాల, పరిపాలన విధానాన్ని ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాలతో పాటు, అభివృద్ధి అన్ని రాష్ట్రాలకు, అందిస్తూ రక్షణ రంగంలో దేశాన్ని ప్రతిష్టంగా నిలిపారు. ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడంతో, ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే మూడో స్థానానికి ఎగబాకుతుండడంతో, అమెరికా భారత్ ఎదగడానికి చూసి ఓర్వలేక సుంకాలు విధిస్తున్నారు. భారతదేశ ఎదుగుదలని ఎవరు ఆపలేరు అన్నారు. భారత్ మాతాకీ జై నినాదాలు చేశారు. ప్రజలలో జాతీయ భవన పెంపొందించడమే లక్ష్యంతో, భావి భారత పౌరులకు జాతీయ జెండా అందిస్తున్నామన్నారు. 13 నుంచి 15 వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ను ఎగరవేయాలని దేశ ప్రధాని నరేంద్ర మోడీ దేశ ప్రజలందరికీ తెలిపారన్నారు. అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్, బొమ్మ రాజు నర్సింహా, వెంకటరమణ, రమేష్ రెడ్డి, రావుల భాస్కర్, మురళీధర్ రెడ్డి సంతోష్ గౌడ్, బుచ్చి రెడ్డి, మధుసూదన్ రెడ్డి, గోపాల్ నాయక్, మన్మోహన్ రెడ్డి, పృథ్వి ముదిరాజ్,మజర్, రామారావు, ఆడికే శివ, ప్రభుదాస్,శేఖర్, షాకీల్, కిరణ్,మల్లేష్, శంకర్,సుభాష్, సదానంద్, యాదగిరి, చెన్నమ్మ, సిద్దప్ప పాల్గొన్నారు.

# భద్రకాళి బండ్ పరివాహక ప్రాంతాల పరిశీలించిన పునరావాస కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే, కలెక్టర్



**వరంగల్ మహా;** గ్రేటర్ వరంగల్ నగరం లో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తో కలిసి నగర మేయర్ గుండు సుధారాణి, కమీషనర్ చాహత్ బాజ్ పాయ్, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు భద్రకాళి బండ్ పై పర్యటిస్తూ బండ్ వెనక వైపు నిర్మాణం అవుతున్న అండర్ డ్రైన్ లో వరద నీటి ప్రవాహ ఉధృతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అలాగే పోతన రోడ్ లో గల మర్వాడి భవన్ లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రం లో వరద బాధితులను పరామర్శించి వసతుల పై ఆరా తీసి భోజన వసతులు అందుతున్నాయని నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా కలెక్టర్ డా.సత్య శారద, వర్ధన్నపేట శాసనసభ్యులు కే ఆర్ నాగరాజు, కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం బల్దియా పరిధి 14 వ డివిజన్ బాలాజీ నగర్ 100 ఫీట్ల రోడ్ ప్రాంతం లో నెలకొన్న పరిస్థితిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బల్దియా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పోల్కంపల్లిలో రెండు బర్రెల దొంగతనం

**వాటి విలువ సుమారు మూడు లక్షలు.. ఆవేదన చెందిన రైతు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు**



**రంగారెడ్డి జిల్లా మహా:** మూడు లక్షల విలువ చేసే రెండు బర్రెలను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లిన ఘటన, ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లి గ్రామ పరిధిలోని జాజోని బావికి చెందిన కసరమోని ఐలయ్య అనే రైతుకు, 20 బర్రెలతో డైరీ ఫార్మ్ కొనసాగిస్తున్నాడు. కాగా మంగళవారం రాత్రి రోజు మాధురి తన డైరీ ఫార్మ్ వద్ద ఉన్న గదిలో నిద్రిస్తున్న సమయంలో, ఇదే అదునుగా భావించిన గుర్తు తెలియని దుండగులు, అర్ధరాత్రి 12 గంటల నుండి 2 గంటల సమయంలో ఆయన నిద్రిస్తున్న గదికి బయట నుండి గొల్లెం వేసి రెండు బర్రెలను ఎత్తుకెళ్ళిపోయారు. సదరు రైతు తెల్లవారుజామున మెలకువ రావడంతో బయటికి వెళ్లే క్రమంలో గదికి బయట నుంచి గొల్లెం పెట్టి ఉండడానికి గమనించిన రైతు, ఇంటికి ఫోన్ చేసి చెప్పడంతో, అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు గది గొల్లెంను తీయడం జరిగింది. దీంతో తన కొట్టంలో రెండు బర్రెలు కనిపించకపోవడంతో ఆవేదన చెందుతూ, బాధితుడు ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు, సీసీ కెమెరాల ఆధారంగా వివరాలను సేకరిస్తున్నట్లు వెల్లడించారు.

# రోడ్డు ప్రమాదంలో కార్మికుడు మృతి

**మందమర్రి, మహా :** రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధి గాంధారి మైసమ్మ దేవాలయం ఆవరణలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మందమర్రి పట్టణానికి చెందిన సింగరేణి కార్మికుడు సాయి వెంకటేష్ మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం మందమర్రి పట్టణానికి చెందిన కసిపేట సాయి వెంకటేష్ (27) సింగరేణి కాలరీస్ కంపెనీ శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే 7 గనిలో విధులు నిర్వహిస్తారని తెలిపారు. మంగళవారం తన అవసర నిమిత్తం మంచిరాలకు ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి వస్తుండగా బొక్కలగుట్ట వద్ద గల నేషనల్ హైవే రోడ్డు, గాంధారి మైసమ్మ దేవాలయం వద్దకు వచ్చినట్లు చెప్పారు. అక్కడ ఒక లారీ డ్రైవర్ అజాగ్రత్తగా ఇలాంటి సిగ్నల్ లైట్లు వేయకుండా రోడ్డు మీద ఆపడంతో, సాయి వెంకటేష్ తన తన వాహనాన్ని లారీకి ఢీ కొట్టడంతో తీవ్రగాయలు అయ్యాయని వివరించారు. గాయాల పాలైన వెంకటేష్ ను మంచిర్యాల లోని ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మృతుడి బావ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

# సాత్నాల ప్రాజెక్టును పరిశీలించిన కలెక్టర్ ఎస్పీ



**ఆదిలాబాద్ మహా :** జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. బుధవారం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తో కలిసి సాత్నాల ప్రాజెక్ట్ ను సందర్శించారు. ప్రాజెక్టులో నీటిమట్టాన్ని పరిశీలించి, ప్రస్తుత పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి తలెత్తినా వెంటనే స్పందించేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల భద్రత విషయంలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని , భారీ వర్షాలు కురిసిన ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో తగిన సహాయక చర్యలు చేపట్టాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని ఎక్కడ కూడా ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా కలెక్టర్ ఎస్పీ మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ జీవన్ రెడ్డి, ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారి విఠల్, ఇంజినీర్లు, సిబ్బంది తదితరులు ఉన్నారు



# భారీ వర్షా ల దృష్ట్యా రానున్న 72 గంటలు హై అలర్ట్

- అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దు
- రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా

**మంచిర్యాల, మహా :** రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా రానున్న 72 గంటలలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా వెల్లడించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రానున్న 72 గంటల పాటు రామగుండం పోలీస్ కమీషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని, వాతావరణ శాఖ సూచించిన దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. వర్షాల వల్ల ఏదైనా విపత్తు సంభవిస్తే పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పోలీసు యంత్రాంగం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే, స్థానిక పోలీస్ అధికారులకు లేదా డయల్ 100కి ఫోన్ చేసి పోలీసు వారి సహాయం పొందాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు,కాలువలు,నదులు, రిజర్వాయర్లు,చెరువుల వద్దకు వెళ్ళరాదని వివరించారు. అలాగే వర్షం ప్రభావం వల్ల చెట్ల కింద, పాడైన భవనాలు కింద, శిధిలావస్థలో ఉన్న భవనాలు, విద్యుత్ స్థంభాలు, ట్రాన్స్ ఫార్మర్ల వద్ద ఉండకూడదని వెల్లడించారు. ఈ సమయాలలో చెరువులోకి, నాలాలు, డ్యామ్స్, వాటర్ ఫాల్స్ లేదా చేపల వేటకు గాని వెళ్ళరాదని స్పష్టం చేశారు. స్థానిక రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ, విద్యుత్, ఆర్. అండ్.బి, వైద్య శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎక్కడైనా రోడ్ల పై వరద ఉధృతితో రోడ్లు తెగిపోయినా, ఉధృతంగా ప్రవహించినా అక్కడికి ఆ గ్రామ ప్రజలు వెళ్లకుండా, రెండు దిక్కులా ప్లాస్టిక్ కోన్స్,బారిగేడ్స్, హెచ్చరిక గల ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

# భారీ వర్షా నికి కాముని చెరువు అలుగు పారుతూ.. గ్రామాల్లోకి వరద నీరు.. జనజీవనం అస్తవ్యస్తం



**రాజేంద్రనగర్ మహా ;** భారీ వర్షాలనిపద్యంలో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో పలు విమానాలను దారి మళ్లించారు. అంతర్జాతీయ విమానాశ్రయం ప్రధాన రహదారులు చెరువును తలపిస్తున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని కాముని చెరువు అలుగు పారుతుంది. శంషాబాద్ మండలం అల్లీకోల్ తండాలో పరిసర ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయి. ఉదయం నుంచి కురుస్తున్న వర్షపు నీరు ఒకే చోట ఉండిపోవడంతో అలీ కొల్ తాండవాసులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సమస్యని గతంలోనే రెవెన్యూ అధికారులకు తెలిపిన పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోయారు. నీటిని నిల్వకుండా కాల్వ ద్వారా తరలించాలని గ్రామస్తులు కోరారు. భారీ వర్షాల నేపథ్యంలో శంషాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. వర్షాల నేపథ్యంలో సహాయ కోసం, .8008554595,, 9493230589 నంబర్లకు సంప్రదించాలన్నారు.

# ఉద్యోగాల పేరుతో అమాయకులకు లక్షల్లో కుచ్చుటోపీ

**ఆదిలాబాద్ లో కీలక వ్యక్తి తో పాటు మరో నలుగురు అరెస్ట్**




**ఆదిలాబాద్, మహా :** ఎస్.కె మైక్రో ఫైనాన్స్ పేరుతో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ పెద్ద ఎత్తున మోసం చేసిన జవాడే కృష్ణను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్టు ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీసు ఏఆర్ హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఇంద్రవెల్లి మండలం శంకర్ గూడ కు చెందిన జవాడే కృష్ణ ఎన్నారై అంటూ, సామాజిక సేవ పేరుతో ప్రముఖులతో పరిచయాలు చేసుకొని వందల మందిని బురిడీ కొట్టించాడన్నారు. 2024 లో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంతో పాటు ఉట్నూరు నందు ఎస్కే మైక్రో ఫైనాన్స్ పేరుతో కార్యాలయాలను ప్రముఖులతో ప్రారంభించి తన నేర పద్ధతినిమొదలుపెట్టాడన్నారు..అమాయక సాధారణ ప్రజలకు ఉద్యోగాలు ఇస్తానంటూ డబ్బులు వసూలు చేసి, జల్సాలకు ఖర్చు చేసేవాడన్నారు. ఇలా ఆదిలాబాద్ జిల్లాలో దాదాపు 300 మందినుండి 20వేల చొప్పున వసూలు చేసి మోసం చేసినట్టు తెలిపారు.ఇలా మొత్తం 69 లక్షల వరకు వసూలు చేసినట్టు విచారణలో తేలిందని తెలిపారు. ఆరు నెలలుగా ఉద్యోగాలు ఇవ్వకపోవడంతో బాధితులు తరచూ అడుగుతూ ఉండడంతో జులై మొదటి వారంలో తన సొంత గ్రామం శంకరగుడా లో తొమ్మిది లక్షల నగదు మూడు లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు దాచి, 15 లక్షల నగదు తో పారిపోయినట్టు వివరించారు. అప్పటినుండి జిల్లా పోలీస్ యంత్రాంగం అతనికోసం అన్వేషిస్తూ బుధవారం పట్టుకున్నట్టు తెలిపారు. నిందితుని వద్ద నుండి తొమ్మిది లక్షల నగదు 10.7 తులాల బంగారు ఆభరణాలు,ఐదు మొబైల్ ఫోన్లు, ఒక ఖరీదైన వాచ్, రెండు కార్లు స్వాధీనం స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.ప్రజల దగ్గర దోచుకున్న డబ్బులతో బంగారు ఆభరణాలు, కారు కొన్నట్లు తెలిపారు. నిందితునిపై ఆదిలాబాద్ జిల్లాలో దాదాపు 16కేసులు నమోదయ్యాయన్నారు.ప్రజలను మోసం చేసిన వ్యక్తులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, ప్రతి ఒక్కరూ చట్టప్రకారం శిక్ష అర్హులన్నారు. ఇతనికి సహకరించిన ఇతని తమ్ముడు జవాడే గోపాల్ తో పాటు మరో ముగ్గురు ఏజెంట్ల ను కూడా అరెస్ట్ చేసినట్టు తెలిపారు.బాధితులు ఇంకా ఎవరైనా ఉన్నట్లయితే జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఎఎస్పి కాజల్ సింగ్ , ఉట్నూర్ సీఐ ఎం ప్రసాద్, ఐటీ కోర్ ఎస్సై గోపి కృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హిమాయత్ సాగర్ నాలుగు గేట్లు ఎత్తి దిగువ ప్రాంతానికి నీరు విడుదల

**పలు ప్రాంతాల్లో రోడ్లన్నీ జలమయం**



**రాజేంద్రనగర్ మహా ;** రాజేంద్రనగర్, శంషాబాద్, గండిపేట్, కోకాపేట్, నార్సింగి ప్రాంతాలలో ఉదయం నుంచి భారీ వర్షం కురుస్తుంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షానికి హిమాయత్ సాగర్ నాలుగు గేట్లు మూడు ఫీట్లు హైట్ కి ఎత్తి నీటిని దిగువ ప్రాంతానికి వదిలారు. నీరు వదలడం తో ఓ ఆర్ ఆర్ సర్వీసు రోడ్డు పై నుండి నీటి ప్రవాహం దిగు ప్రాంతాలకు వెళుతుంది. దీంతో ట్రాఫిక్ పోలీసులు ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డును భారీ క్రేడ్లు వేసి తాత్కాలికంగా నిలిపివేశారు. దీంతో అటువైపు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. పలు ప్రాంతాల్లోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. ట్రాఫిక్ కి తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాహనదారులు గంటల తరబడి ట్రాఫిక్ లో నిలుచున్నారు.



# నిరుపేద విద్యార్థులకు ఉపకార వేతనాలు

**మంచిర్యాల, మహా :** ప్రభుత్వ పాఠశాలలలో 10వ తరగతి పూర్తి చేసుకొని ఇంటర్మీడియట్ విద్యను అభ్యసిస్తున్న నిరుపేద విద్యార్థులకు క్రెడిట్ యాక్సెస్ ఇండియా ఫౌండేషన్ సంస్థ ఉపకార వేతనాలు అందించడం అభినందనీయమని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్లో సంస్థ డివిజనల్ మేనేజర్ రెల్ల చంద్రశేఖర్, సీనియర్ ఏరియా మేనేజర్ పోకల నరసింహారావు, చెన్నూర్, పెద్దపల్లి శాఖల మేనేజర్లు సిరిపంగి నాగరాజు, శ్రీధర్లతో కలిసి విద్యార్థులకు ఉపకార వేతనాల చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో ఉత్తమ మార్కులతో 10వ తరగతి పూర్తి చేసిన దమ్ము లాస్య, తోటపెల్లి మౌనిక, సందనవేని పూజ, గౌమాస అశ్రిత లకు ఇంటర్మీడియట్ విద్య కొరకు ఉపకార వేతనాలు అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# 170 సర్వే నంబర్ లో మరో భూ భాగోతం

**కబ్జాకు ప్రయత్నించిన వారిలో నలుగురి అరెస్ట్**

**ఆదిలాబాద్ మహా :** నకిలీ డాక్యుమెంట్ సృష్టించి భూ కబ్జాకు ప్రయత్నించిన నలుగురిని అరెస్టు చేసి రిమాండ్ కు పంపినట్టు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి తెలిపారు. మావల మండల పరిధిలోని 170 సర్వే నంబర్ లో ఒకరికి మంజూరైన ప్లాట్ ను తప్పుడు ధృవీకరణ పత్రాలు సృష్టించి మరొకరి పేరుతో మార్చి ఇంకో వ్యక్తికి అమ్మిన కేసు గురించి బుధవారం మావల పోలీస్ స్టేషన్ లో మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు.ప్లాట్ ఓనర్ స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్టు తెలిపారు. వివరాల్లోకి వెళితే 2013 లో స్వామికి పేదలకు భూపంపిణీలో భాగంగా అప్పటి ఎమ్మార్వో 905 నంబర్ ప్లాట్ ను కేటాయించారు. 2015లో గ్రామ పంచాయతీ నుండి బిల్డింగ్ పర్మిషన్ తీసుకున్నారు. తదుపరి అనారోగ్య కారణాలవల్ల బాధితుడు ఎటువంటి భవన నిర్మాణం చేసుకోలేదు. 2021 లో ఎలాగైనా ఈ స్థలాన్ని కొట్టేయాలన్న దురుద్దేశంతో నిందితులు రెహ్మాన్ ఖాన్, పవన్ నాయక్, సుంకరి సంతోష్ అనే వ్యక్తులు తహసిల్దార్ ద్వారా తమకు కేటాయించినట్టు నకిలీ పత్రాలను సృష్టించి, అసలైన యజమానిని స్థలంలోకి రానివ్వకుండా సుంకరి వంశీకృష్ణ సహాయంతో బెదిరింపులకు పాల్పడినట్టు తెలిపారు. పవన్ నాయక్, రెహమాన్ ఖాన్ అనే వ్యక్తులు నకిలీ పత్రాలు సృష్టించారని తెలిసినా సుంకరి సంతోష్ తన భార్య సుంకరి వెంకటమ్మ పేరిట 2021లో రెండున్నర లక్షల రూపాయలకు కొన్నట్టు తెలిపారు.అనంతరం తాటి లక్ష్మణ్ అనే వ్యక్తి హౌస్ నంబర్లు కరెంట్ బిల్లు రావడంలో డబ్బులు తీసుకొని సహాయం చేసినట్టు తేలిందన్నారు. అదే ప్లాట్ ను సుంకరి వెంకటమ్మ సుంకరి సంతోష్ లు అధిక ధరలకు కిష్టన్న అనే వ్యక్తికి అమ్మినట్టు వివరించారు. నిందితులు పక్కా పథకం ప్రకారం కబ్జా చేయాలనే దురుద్దేశంతో నకిలీ పత్రాలను సృష్టించి ఆ నకిలీ పత్రాల సహాయంతో ప్లాటును విక్రయించి బాధితునికి అన్యాయం చేసినట్టు తెలిపారు. ఈ కేసులో రహమాన్ ఖాన్ , సుంకరి సంతోష్ ,తాటి లక్ష్మణ్ ,సుంకరి వంశీకృష్ణ లను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. మిగతా వారు పరారీలో ఉన్నట్టు తెలిపారు. బాధితులు ఎవరైనా నిర్భయంగా జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని సంప్రదించవచ్చని సరైన న్యాయం జరుగుతుందని తెలిపారు.






# కొత్తగా 20,000 ఉద్యోగాలు

## పీడబ్ల్యూసీ ఇండియా ప్రణాళికలు

కన్సల్టెన్సీ దిగ్గజం పీడబ్ల్యూసీ ఇండియా వచ్చే ఐదేళ్ల వ్యవధిలో కొత్తగా 20,000 ఉద్యోగాలు కల్పించనుంది. దీనితో సంస్థలో మొత్తం సిబ్బంది సంఖ్య 50,000కు చేరనుంది. విజన్ 2030ని ప్రకటించిన సందర్భంగా పీడబ్ల్యూసీ ఇండియా చైర్‌పర్సన్ సంజీవ్ కృషన్ ఈ విషయం తెలిపారు. వచ్చే ఐదేళ్లలో వార్షికాదాయాల్లో 5% టెక్నాలజీ, ఇన్నోవేషన్ తదితర అంశాలపై ఇన్వెస్ట్ చేయనున్నట్లు వివరించారు. దాంతోపాటు డిజిటల్ పరివర్తన, క్లౌడ్, సైబర్‌సెక్యూరిటీలాంటి వ్యాపార విభాగాల పై దృష్టి పెట్టనున్నట్లు సంజీవ్ చెప్పారు. సిబ్బంది, భాగస్వాములకు కొత్త నైపుణ్యాల్లో శిక్షణనిచ్చేందుకు ఆదాయాల్లో 1 శాతం భాగాన్ని వెచ్చిస్తున్నట్లు వివరించారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోకి కూడా కార్యకలాపాలు విస్తరిస్తూ, హైరింగ్ చేపడుతున్నామని సంజీవ్ చెప్పారు. ప్రధానంగా ఆర్థిక సేవలు, హెల్త్‌కేర్, ఆటో, టెక్నాలజీ, మీడియా వంటి ఆరు విభాగాలపై ఫోకస్ పెడుతున్నట్లు వివరించారు.





# బంగారం పెట్టుబడులు భారీగా తగ్గాయ్..

బంగారం ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్‌లోకి జులైలో రూ.1,256 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. జూన్ నెలలో పెట్టుబడులు రూ.2,081 కోట్లతో పోల్చి చూస్తే ఏకంగా 40 శాతం తగ్గాయి. ఈ ఏడాది మే నెలలోనూ బంగారం ఈటీఎఫ్‌లు రూ.292 కోట్ల మేర పెట్టుబడులను ఆకర్షించడం గమనార్హం. పసిడి ధరలు ఆల్‌టైమ్ గరిష్ఠాల్లో ఉండడంతో ఇన్వెస్టర్లు కొంత అప్రమత్త ధోరణితో వ్యవహరించినట్టు తెలుస్తోంది. అయినప్పటికీ వరుసగా మూడో నెలలోనూ గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి నికరంగా పెట్టుబడులు వచ్చినట్లు మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) విడుదల చేసిన గణాంకాల ఆధారంగా తెలుస్తోంది. అంతకుముందు వరుసగా రెండు నెలల్లో.. ఏప్రిల్‌లో రూ.6 కోట్లు, మార్చిలో 77 కోట్ల చొప్పున గోల్డ్ ఈటీఎఫ్‌ల నుంచి ఇన్వెస్టర్లు పెట్టుబడులు ఉపసంహరించుకున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి జూలై వరకు ఏడు నెలల్లో గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి నికరంగా వచ్చిన పెట్టుబడులు రూ.9,277 కోట్లుగా ఉన్నాయి. ఇన్వెస్టర్లు తమ పెట్టుబడుల పోర్ట్‌ఫోలియోలోకి పసిడికి సైతం చోటు కల్పిస్తున్నట్లు ఈ గణాంకాలు తెలియజేస్తున్నాయి. జూలై చివరికి గోల్డ్ ఈటీఎఫ్‌ల నిర్వహణలోని మొత్తం పెట్టుబడులు రూ.67,634 కోట్లకు పెరిగాయి. జూన్ చివరికి ఉన్న రూ.64,777 కోట్లతో పోల్చి చూస్తే 4.4 శాతం వృద్ధి చెందాయి.

### 78.69 లక్షల ఫోలియోలు

గోల్డ్ ఈటీఎఫ్‌లలో మొత్తం ఫోలియోలు (ఇన్వెస్టర్ పెట్టుబడి ఖాతా) జూలై చివరికి 78.69 లక్షలకు చేరాయి. 2.15 లక్షల కొత్త ఫోలియోలు నమోదయ్యాయి. 'బంగారం గత రెండేళ్లలో బలమైన పనితీరు చూపించినప్పటికీ దీన్ని పూర్తిగా అర్థం చేసుకోవడం ఇన్వెస్టర్లకు కష్టమే. చాలా మంది ఇన్వెస్టర్లు హెడ్జింగ్ దృష్ట్యా బంగారానికి కొంత పెట్టుబడులు కేటాయించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ప్రస్తుతం గరిష్ట స్థాయిల్లో ఉన్న దృష్ట్యా అప్రమత్తత అవసరం' అని జెర్మైట్ ఇన్వెస్టర్ సర్వీసెస్ సీఈవో సంతోష్ జోసెఫ్ సూచించారు.స్థూల ఆర్థిక అనిశ్చితులు, అంతర్జాతీయంగా వడ్డీ రేట్లలో అస్థిరతలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో పోర్ట్‌ఫోలియో వైవిధ్యం దృష్ట్యా బంగారానికి డిమాండ్ కొనసాగుతున్నట్టు మార్నింగ్ స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చ్ ఇండియా సీనియర్ అనలిస్ట్ నేహల్ మెష్రామ్ పేర్కొన్నారు.





# ఫ్లిప్‌కార్ట్ ఒక్కరోజు ప్రత్యేక సేల్

ప్రముఖ ఈకామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న 'క్రాఫ్టెడ్ బై భారత్' పేరుతో ప్రత్యేక సేల్ నిర్వహించనుంది. ఫ్లిప్‌కార్ట్ సమర్థ్ కార్యక్రమం కింద నిర్వహిస్తున్న ఈ సేల్ 10వ ఎడిషన్‌ది. భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశీయ కళాకారులు, చేనేతలు, మహిళా వ్యాపారవేత్తలకు ప్రోత్సాహం కల్పించే ఉద్దేశంతో ఫ్లిప్‌కార్ట్ ఈ సేల్ నిర్వహిస్తోంది. ఈ ఒక్కరోజు ప్రత్యేక సేల్‌లో 1.4 లక్షలకు పైగా హస్తకళా ఉత్పత్తుల విక్రయానికి అవకాశం కల్పిస్తారు. 2,200 మందికి పైగా కళాకారులు, స్వయం సహాయక సంఘాలు, మహిళా వ్యాపారవేత్తలు పాల్గొంటున్నారు. వార్లీ, పటచిత్ర, మధుబని, పిచ్వాయి, టెర్రకోటా, ప్రాంతీయ చెక్క కళాకృతులు, హోమ్ డెకోర్, ఫర్నిచర్, వంటగది వస్తువులు, దుస్తులు మొదలైనవి ఈ ప్రత్యేక సేల్‌లో అందుబాటులో ఉంటాయి. భదోహి, హత్రాస్, మధురై, కన్నౌజ్, రామనగర, ఉజ్జయిని వంటి చిన్న పట్టణాల మహిళలు తమ ఉత్పత్తులు విక్రయించుకునేందుకు ఈ సేల్ అవకాశం కల్పిస్తోంది. ఏటా నిర్వహించే ఈ సేల్‌లో ఈసారి 100 మందికిపైగా కొత్త విక్రేతలు చేరారు. ఎంఎస్‌ఎంఈలు, స్థానిక కళాకారులకు సాధికారత కల్పిస్తూ తమ ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో ఈకామర్స్ వేదికగా విక్రయించుకునేందుకు ఫ్లిప్‌కార్ట్ సమర్థ్ మిషన్ సహకారం అందిస్తోంది.

## ఐఐటీ హైదరాబాద్‌లో అద్భుతం..

# డ్రైవర్ లేని బస్సుల ఘనత

ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ (ఐఐటీహెచ్) క్యాంపస్‌లో అద్భుత ఘనత నమోదైంది. క్యాంపస్ రోడ్లపై రోజువారీ సేవల కోసం అందుబాటులోకి తెచ్చిన ఏఐ ఆధారిత డ్రైవర్ రహిత బస్సులు రోజుల వ్యవధిలోనే 10,000 మందికి పైగా ప్రయాణీకులను తరలించాయి. ఇన్స్టిట్యూట్ టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్ ఆన్ అటానమస్ నావిగేషన్ (టిహాన్) రూపొందించిన వాహనాలు పూర్తిగా ఎలక్ట్రిక్‌గా, మానవ డ్రైవర్ లేకుండా నడుస్తాయి. ఆరు సీట్ల, పద్నాలుగు సీట్లుగా రెండు వేరియంట్ల వాహనాలు ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో సేవలు అందిస్తున్నాయి. కొత్తగా క్యాంపస్ రోడ్లపైకి వచ్చిన ఈ బస్సులు ఇప్పటికే 10,000 మందికి పైగా ప్రయాణీకులను తరలించాయి. ప్రయాణీకుల ఫీడ్ బ్యాక్ ఎక్కువగా సానుకూలంగా ఉందని, 90 శాతం సంతృప్తి రేటు ఉందని టిహాన్ నివేదించింది.




### అన్ని విధాలా సిద్ధంగా..


ఐఐటీ హైదరాబాద్ రూపొందించిన డ్రైవర్ రహిత బస్సులు కేవలం ప్రయోగాత్మకం కాదు. సాంకేతికపరంగా అన్ని విధాలా సిద్ధంగా ఉన్నాయి. ఈ బస్సులలో అటానమస్ ఎమర్జెన్సీ బ్రేకింగ్, అడాప్టివ్ క్రూయిజ్ కంట్రోల్ వ్యవస్థలను అమర్చారు. ఇవి వేగాన్ని సర్దుబాటు చేయడానికి, అడ్డంకులను గుర్తించడానికి, సురక్షిత దూరాలను నిర్వహించడానికి అనుమతిస్తాయి. ఈ డ్రైవర్ రహిత బస్సుల ప్రాజెక్ట్ టెక్నాలజీ రెడీనెస్ లెవల్ 9కు చేరుకుంది. అంటే ఇది వాస్తవప్రపంచ పరిస్థితులలో నిరూపించుకుంది. ఐఐటీ హైదరాబాద్‌కు ఈ ప్రాజెక్ట్ ఒక రవాణా పరిష్కారం మాత్రమే కాకుండా భారతదేశ మొబిలిటీ రంగంలో సరికొత్త ఆవిష్కరణ సాధ్యమని చూపించే ఒక ప్రదర్శన. దేశంలోనే తొలి అటానమస్ నావిగేషన్ టెస్ట్‌బెడ్‌ను కూడా టిహాన్ నిర్మించింది. ఈ సదుపాయం భారతీయ డ్రైవింగ్ పరిస్థితులను ప్రతిబింబిస్తుంది. కంపెనీలు, పరిశోధకులు, ప్రభుత్వ సంస్థలు పబ్లిక్ రోడ్లపై ఉపయోగించే ముందు సెల్ఫ్ డ్రైవింగ్ వ్యవస్థలను పరీక్షించడానికి, ధృవీకరించడానికి వీలు కల్పిస్తుంది.

# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

# అమితాబ్ పరువు తీస్తోంది.. సిగ్గులేని మనిషి : జయపై కంగన ఫైర్

సమాజ్‌వాదీ పార్టీ , రాజ్యసభ ఎంపీ జయాబచ్చన్‌పై హిమాచల్ ప్రదేశ్‌లోని మండికి చెందిన బీజేపీ ఎంపి కంగనా రనౌత్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో తనతో సెల్ఫీ తీసుకోవడానికి ప్రయత్నించిన వ్యక్తిని బచ్చన్ తోసేస్తున్న వీడియో వైరల్ అయిన నేపథ్యంలో కంగనా ఆమెపై తీవ్ర విమర్శలు చేసింది. ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో జయాబచ్చన్ వీడియోను షేర్ చేస్తూ ఇలా కామెంట్ చేసింది. "అత్యంత చెడిపోయిన, విశేషాధికారం కలిగిన మహిళ" అని అంటూ విమర్శలు గుప్పించింది. అంతేకాదు భర్త అమితాబ్ బచ్చన్ మర్యాదను మంట గలుపుతోందంటూ వ్యాఖ్యానించింది. "ఆమె అమితాబ్ బచ్చన్ భార్య కాబట్టి ప్రజలు ఆమె కోపతాపాలను/అర్థంలేని తనాన్ని సహించారు. సమాజ్‌వాదీ పార్టీ కోడిపుంజులా పందెంకోడిలా, ప్రవర్తిస్తోందంటూ ఎద్దేవా చేస్తే, ఎంత అవమానం, సిగ్గుచేటు" అని కంగనా మండిపడింది. ప్రస్తుతం కంగనా వ్యాఖ్యలు నెట్టింట చర్చకు దారి తీశాయి. గతంలో జయాబచ్చన ఇలాంటి విమర్శలొచ్చిన సందర్భంలో కంగనా వెనకేసుకొచ్చింది. నిజం చెప్పాలంటే..ఆమె కోపిష్ఠిమనిషే కానీ అదే సమయంలో ఆమె గొప్ప వ్యక్తి అంటూ జయాను తెగ పొగిడేసింది. 1970లలో ఆమె సినీరంగంలో రాణించారని, సినీ పరిశ్రమలో అత్యంత గౌరవప్రదమైన మహిళల్లో ఒకరు అంటూ జయను కంగనా ప్రశంసించింది. సెల్ఫీ కోసం ఆశతో వచ్చిన అభిమానిని తోసేసి ఏం చేస్తున్నావ్ (క్యా కర్ రహే హై ఆప్?) అంటూ ఆగ్రహం వ్యక్తం చేసి పక్కకు నెట్టేశారు.దీంతో సదరు వ్యక్తి సారీ చెప్పారు. ఈ అనూహ్య పరిణామానికి అక్కడున్నవారంతా హతాశులైన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించిన వీడియో నెట్టింట్ హల్‌చల్ చేసింది. సింపుల్‌గా సెల్ఫీ వద్దు అంటే సరిపోయేది.. కానీ అతణ్ణి చేత్తో నెట్టివేయడం దారుణం అంటున్నారు. కొంతమంది యాటిట్యూడ్ అంటూ జయాబచ్చన్‌ను విమర్శించగా, మరి కొందరు జయ ప్రవర్తనను సమర్థించారు కూడా.





# వీధి కుక్కల తీర్పుపై సుప్రీం కోర్టు యూటర్న్?

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ప్రాంతం నుంచి వీధి కుక్కలన్నింటినీ తొలగించాలంటూ వెలువరించిన తీర్పుపై సుప్రీంకోర్టు యూటర్న్ తీసుకునే అవకాశం కనిపిస్తోంది. చాలామంది ఈ తీర్పును సమర్థించగా.. కొన్ని వర్గాల నుంచి మాత్రం తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. ఈ తరుణంలో.. ఈ అంశాన్ని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ముందు కొందరు న్యాయవాదులు లేవనెత్తారు. అయితే అభ్యంతరాల నేపథ్యంలో ఆ తీర్పును పునపరిశీలిస్తానని బుధవారం స్పష్టం చేశారు. దీంతో తీర్పు వెనక్కి తీసే అవకాశాలు ఉండొచ్చనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు జంతు ప్రేమికులు. రాజధాని రీజియన్‌లో పసికందులు, వృద్ధులుపై వీధి కుక్కల దాడుల ఘటనలపై పలు మీడియా సంస్థలు ఇచ్చాయి. అందులో ఘటనలతో పాటు రేబిస్ బారిన పడి మరణించిన దాఖలాలను ప్రస్తావించాయి. ఈ కథనాలను సుమోటోగా స్వీకరించిన సుప్రీం కోర్టు విచారణ చేపట్టింది. వీధి కుక్కలను నివాస ప్రాంతాల్లో సంచరించడం ఏమాత్రం యోగ్యం కాదని, వాటిని పట్టుకుని షెల్టర్లకు తరలించాలని, ఇందుకు 8 వారాల గడువు విధిస్తూ ఢిల్లీ సర్కార్‌కు జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం సోమవారం (ఆగస్టు 11వ తేదీ) ఆదేశాలు జారీ చేసింది. అదే సమయంలో.. ఏదైనా సంస్థలు ఈ చర్యలను అడ్డుకోవాలని చూస్తే తీవ్ర పరిణామాలను ఎదుర్కొవాల్సి ఉంటుందని, ఇది ప్రజల మేలు కోసం చేస్తున్నది స్పష్టం చేసింది. అయితే వీధి కుక్కల కోసం షెల్టర్లు నిర్మించడం, తరలించడం ఆచరణ సాధ్యం కాకపోవచ్చని ఢిల్లీ అధికార యంత్రాంగం అంటోంది. అదే సమయంలో రాజకీయ, సినీ, ఇతర ప్రముఖుల నుంచి సుప్రీం కోర్టు తీర్పుపై అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి.

# ఏపీలోనే భారీ ఓట్ల చోరీ.. అయినా రాహుల్ గాంధీ మాట్లాడరేం?: వైఎస్ జగన్

**తాడేపల్లి:** ఓట్ చోరీ వ్యవహారంలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సూటి ప్రశ్నను సంధించారు. దేశంలో అత్యధికంగా ఓట్ల గోల్‌మాల్ జరిగింది ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లోనేనని.. అలాంటిది రాహుల్ గాంధీ ఏపీ గురించి ఎక్కడా ఎందుకు ప్రస్తావించడం లేదని ప్రశ్నించారాయన. బుధవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్రకార్యాలయంలో పులివెందుల, ఒంటిమిట్ట అక్రమ ఎన్నికలపై వైఎస్ జగన్ మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంలో ఓట్ల దొంగతనం వ్యవహారంపై ఇండియా కూటమికు మద్దతు గురించి జగన్‌కు మీడియా నుంచి ప్రశ్న ఎదురైంది. దానికి ఆయన స్పందిస్తూ.. గతేడాది ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగకముందు.. జరిగిన తర్వాత ఉన్న ప్రకటించిన ఓట్లకు.. లెక్కించిన ఓట్ల సంఖ్యకు సమారు 12.5శాతం వ్యత్యాసం ఉంది. ఆ మొత్తం 48లక్షల ఓట్లు. అంటే దేశంలో ఏ రాష్ట్రంలో జరగని విధంగా ఏపీలో అత్యధికంగా ఓట్ల చోరీ జరిగింది. మరి ఓట్ల చోరీ గురించి అవకతవకలు జరిగాయని అంటున్న రాహుల్ గాంధీ.. దీని గురించి ఎందుకు మాట్లాడడం లేదు. ఎందుకు?.. ఎందుకంటే.. రేవంత్ ద్వారా చంద్రబాబు కాంగ్రెస్ అధిష్టానంతో టచ్‌లో ఉన్నారు. చంద్రబాబుతో రాహుల్ గాంధీ హాట్‌లైన్‌లో టచ్‌లో ఉన్నారు. అందుకే చంద్రబాబు గురించి ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణికం ఠాకూర్ ఒక్క కామెంట్ కూడా ఎందుకు చేయరు?. ఏపీలో ఎన్నో స్కాంలు జరుగుతున్నాయి. వాటిని కాంగ్రెస్ ఎందుకు ప్రశ్నించదు అని వైఎస్ జగన్ అన్నారు.



ఇదే విషయాన్ని ప్రెస్‌మీట్ అనంతరం జాతీయ మీడియా చానెల్‌తో మాట్లాడుతూ జగన్ వివరించారు. ఓట్ల గోల్‌మాల్‌పై మేం గతంలో కోర్టుకు వెళ్లాం. ప్రత్యేకించి ఒంగోలు ఓటింగ్ విషయంలో న్యాయ పోరాటం చేశాం అనే సంగతిని జగన్ గుర్తుచేశారు. అలాగే.. ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ న్యూఢిల్లీ అసెంబ్లీ నియోజకవర్గంలో 2013 నుంచి వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారని, నాలుగోసారి అదే స్థానం నుంచి పోటీ చేసి ఓడిపోయారని, ఓటమిపాలైన అరవింద్ కేజ్రీవాల్ గురించి ఎందుకు మాట్లాడడం లేదు? అని రాహుల్ గాంధీని వైఎస్ జగన్ ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల్లో, అలాగే ఆ తర్వాత జరిగిన పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో భారీ ఓట్ల చోరీ జరిగిందని, ఇందుకు బీజేపీకి ఈసీ సహకరించిందని రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలకు దిగిన సంగతి తెలిసిందే. ఇది కేవలం ఎన్నికల కుంభకోణం మాత్రమే కాదని.. ప్రజాస్వామ్యానికి జరిగిన అతిపెద్ద ద్రోహం అంటూ పోరాటానికి సిద్ధమంటూ ప్రకటించారాయన.

## నాడు సోనియా పేరు ఓటరు లిస్టులో

# ఎలా చేరింది?

## రాహుల్‌కు బీజేపీ కౌంటర్

న్యూఢిల్లీ: లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఎన్నికల సంఘం (ఈసీ) చేపట్టిన ఎన్నికల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై పలు ప్రశ్నలు లేవనెత్తుతుండగా, భారతీయ జనతా పార్టీ (బీజేపీ)దీనికి కౌంటర్ వేసింది. రాహుల్ తల్లి, కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ భారత పౌరురాలు కావడానికి ముందే ఓటర్ల జాబితాలో ఆమె పేరును ఎలా చేర్చారని ప్రశ్నించింది. భారత ఓటర్ల జాబితా విషయంలో నాడు సోనియా గాంధీ చేసిన ప్రయత్నం ఎన్నికల చట్టాన్ని ఉల్లంఘించినట్లు స్పష్టమవుతోంది. అందుకే అనర్హులు, అక్రమ ఓటర్లను క్రమబద్ధీకరించడంపై రాహుల్‌కున్న వ్యతిరేకత ఇప్పుడు బయటపడుతోందంటూ బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాల్వియా 'ఎక్స్' పోస్టులో పేర్కొన్నారు. సోనియా గాంధీ పేరు తొలుత 1980లో ఓటర్ల జాబితాలో కనిపించింది . ఆమె భారతీయ పౌరురాలు కావడానికి మూడేళ్ల ముందే ఇది జరిగింది. అప్పటికి ఆమె ఇటాలియన్ పౌరసత్వాన్ని కలిగివున్నారు. ఆ సమయంలో గాంధీ కుటుంబం సఫ్దర్‌జంగ్ రోడ్డులోని నాటి ప్రధాని ఇందిర అధికారిక నివాసంలో ఉండేది. ఆ చిరునామాలో నమోదు చేసుకున్న ఓటర్లుగా ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, సంజయ్ గాంధీ,మేనకా గాంధీ పేర్లున్నాయి. 1980లో న్యూఢిల్లీ పార్లమెంటరీ నియోజకవర్గం ఓటర్ల జాబితాను సవరించారు. ఈ సవరణ సమయంలో, సోనియా గాంధీ పేరు పోలింగ్ స్టేషన్ 145లో సీరియల్ నంబర్ 388లో జతచేశారు. అయితే ఆమె పౌరసత్వం విషయంలో పలువురి నుంచి వ్యతిరేకత వచ్చిన దరిమిలా ఆమె పేరు జాబితా నుండి తొలగించారు. 1983లో జరిగిన ఓటర్ల జాబితాల సవరణలో, సోనియా గాంధీ పేరు పోలింగ్ స్టేషన్ 140లోని సీరియల్ నంబర్ 236లో నమోదయ్యింది. ఇది 1983 జనవరి ఒకటిన జరిగింది. ఆమెకు 1983 ఏప్రిల్ 30న భారత పౌరసత్వం లభించిందని మాల్వియా తెలిపారు. భారత పౌరసత్వం లేకుండానే సోనియా గాంధీ పేరు రెండుసార్లు ఓటర్ల జాబితాలోకి ప్రవేశించిందని ఆయన ఆరోపించారు.







# బాలీవుడ్‌లో నన్ను గ్లామర్ డాల్‌గానే చూస్తున్నారు: పూజా హెగ్డే

తమిళసినిమా: పాన్ ఇండియా కథానాయకిగా రాణిస్తున్న నటి పూజాహెగ్డే. హిందీ, తెలుగు, తమిళం భాషల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు. కాగా హిందీ భాషల్లో నటిస్తున్నా ఈ అమ్మడికి క్రేజ్ తెచ్చిపెట్టింది తెలుగు చిత్ర పరిశ్రమనే. అక్కడ వరుస పెట్టి హిట్ చిత్రాల్లో నటించిన పూజాహెగ్డే ఆ తర్వాత వరుసగా ఫ్లాప్‌లను ఎదుర్కొన్నారు. దీంతో టాలీవుడ్‌లో మార్కెట్ డౌన్ అయిపోయింది. అయితే ఈ బ్యూటీని కోలీవుడ్ రెండోసారి అక్కున చేర్చుకుంది. 13 ఏళ్ల క్రితం ముఖముడి అనే చిత్రం ద్వారా కోలీవుడ్‌కు ఎంట్రీ ఇచ్చిన ఈ భామ మొదట్లోనే అపజయాన్ని మూటగట్టుకున్నారు. ఆ తర్వాత విజయ్ సరసన బీస్ట్ చిత్రంలో నటించే అవకాశం రావడంతో సంబరపడ్డారు. అయితే ఆ చిత్రం కూడా పూర్తిగా నిరాశనే మిగిల్చింది. అయినప్పటికీ కోలీవుడ్ ఈమెను వదులుకోలేదు ఇటీవల సూర్యకు జంటగా రెట్రో చిత్రంలో నటించారు. ప్రస్తుతం మరోసారి విజయ్‌కు జంటగా జననాయకన్ చిత్రంలో నటిస్తున్నారు. తదుపరి రాఘవ లారెన్స్‌తో కాంచన–4 చిత్రంలో నటించడానికి సిద్ధమవుతున్నారు. మధ్యలో రజనీకాంత్ కథానాయకుడిగా నటించిన కూలీ చిత్రంలో ప్రత్యేక పాటలో నటించారు.

విశేషమేమిటంటే పూజాహెగ్డే ఇప్పటివరకు నటించిన ఏ చిత్రానికి రానటువంటి పాపులారిటీ ఈ ఒక్క పాటకే రావడం. కూలీ చిత్రం గురువారం అంతర్జాతీయ స్థాయిలో తెరపైకి రానుంది. పూజాహెగ్డే ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ దర్శకుడు లోకేష్ కనకరాజ్ ప్రత్యేక పాటలో నటించడానికి అవకాశం కల్పించినందుకు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. బాలీవుడ్‌లో తనను గ్లామర్‌డాల్‌గానే చూస్తున్నారన్నారు. బహుశా తెలుగు, తమిళ చిత్రాల్లో తను నటించడం వారు చూసి ఉండరేమో అని అన్నారు. తాను ఈ సమయంలో దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు రెట్రో చిత్రంలో తనను రుక్మిణీ కథాపాత్ర గానే మార్చారన్నారు. తనలోని నటనా ప్రతిభను ఆయన నమ్మారని పూజాహెగ్డే పేర్కొన్నారు.



# ముగిసిన మంచు లక్ష్మి ఈడీ విచారణ... మూడున్నర గంటల పాటు..

టాలీవుడ్ నటి మంచు లక్ష్మీ ఈడీ విచారణ ముగిసింది. బెట్టింగ్ యాప్ కేసులో భాగంగా.. ఈ రోజు ఉదయం 11 గంటలకు బషీర్‌బాగ్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కార్యాలయానికి వెళ్లిన మంచు లక్ష్మిని ఈడీ బృందం దాదాపు మూడున్నర గంటల పాటు విచారించింది. ఈ సందర్భంగా తన బ్యాంకు ఖాతాలకు సంబంధించిన ఐదేళ్ల లావాదేవీలను ఈడీ అధికారులకు లక్ష్మీ అందించారు. విచారణ అనంతరం మీడియాతో మాట్లాడకుండానే మంచు లక్ష్మీ వెళ్లిపోయారు. బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసిన సెలబ్రిటీలకు జులై 21న ఈడీ సమన్లు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో జులై 30న ప్రకాశ్ రాజ్, ఈ నెల 6న విజయదేవరకొండ, 11న హీరో రానా ఈడీ ముందు హాజరయ్యారు. షెడ్యూల్ ప్రకారం ఈ రోజు మంచు లక్ష్మీ విచారణకు హాజరైంది. బెట్టింగ్ యాప్స్ కేసులో నమోదైన వేర్వేరు ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఈసీఐఆర్) రిజిస్టర్ చేసిన సంగతి తెలిసిందే. లోన్ యాప్స్ ప్రచారకర్తలుగా వ్యవహరించిన మొత్తం 29 మందిని ఈసీఐఆర్‌లో చేర్చింది.



# మూడో సినిమా..

## ఏకంగా ముగ్గురు బ్యూటీస్

తమిళ హీరో విక్రమ్ వారసుడు ధ్రువ్ విక్రమ్ ఇప్పటికే రెండు సినిమాల్లో హీరోగా చేశాడు. కానీ సరైన సక్సెస్ అందుకోలేకపోయాడు. అయినా సరే ఛాన్సులు వస్తున్నాయి. ప్రస్తుతం మారి సెల్వరాజ్ దర్శకత్వంలో 'బైసన్' అనే మూవీ చేస్తున్నాడు. క్రీడా నేపథ్యంలో సాగే ఈ చిత్రం చివరిదశకు చేరుకుంది. మరోవైపు మణిరత్నం దర్శకత్వంలో ఓ యూత్ ఫుల్ లవ్ స్టోరీలో ధ్రువ్‌కి ఛాన్స్ వచ్చినట్లు తెలుస్తోంది.

మరోవైపు హిందీలో గతేడాది హిట్ అయిన 'కిల్' చిత్రాన్ని తమిళం, తెలుగు భాషల్లో రీమేక్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. టాలీవుడ్ దర్శకుడు రమేష్ వర్మ దీన్ని తెరకెక్కించనున్నారు. తమిళ వెర్షన్ కోసం ధ్రువ్ విక్రమ్ హీరోగా ఎంపికైనట్లు తెలుస్తోంది. ఇందులోనే ధ్రువ్‌కి జంటగా కాయదు లోహార్, అనుపమ పరమేశ్వరన్, కేతిక శర్మని తీసుకున్నట్లు తెలుస్తోంది.

వాస్తవానికి ఒరిజినల్ హిందీ వెర్షన్‌లో ఒక హీరోయినే ఉంటుంది. కానీ తమిళం, తెలుగు భాషల్లోకి వచ్చేసరికి 'కిల్' చిత్ర కథలో మార్పులు చేసి ముగ్గురు హీరోయిన్లని ప్లాన్ చేసినట్లు సమాచారం. కాగా ఈ క్రేజీ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశం ఉంది.

# నిధి అగర్వాల్‌కు ప్రభాస్ సర్‌ప్రైజ్..



టాలీవుడ్ రెబల్ స్టార్ ప్రభాస్ ఆహార ప్రియుడని మనకు తెలిసిందే. అంతేకాదు.. అతిథులకు మర్యాద చేయడంలో ఇంకా ముందుంటారు. అది సెట్‌లో అయినా.. ఇంట్లో అయినా సరే కడుపునిండా భోజనం పెట్టే పంపిస్తాడు. అలా ఇప్పటికే షూటింగ్స్‌తో పాటు పలువురు సెలబ్రిటీలకు సైతం భోజనాలు ఏర్పాటు చేస్తుంటారు. తాజాగా హరిహర వీరమల్లు హీరోయిన్ నిధి అగర్వాల్‌కు భోజనం పంపించారు మన ప్రభాస్. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. ఈ సందర్భంగా ప్రభాస్ పెద్దమ్మ శ్యామలాదేవికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. అలాగే ప్రభాస్‌తో పాటు వంశీకి ధన్యవాదాలు అంటూ ట్వీట్ చేసింది. ఆంధ్ర వంటకాలతో పాటు అద్భుతమైన మీల్స్ దొరికాయని సంతోషం వ్యక్తం చేసింది.

### ది రాజాసాబ్‌లో నిధి..

ప్రభాస్ హీరోగా వస్తోన్న రొమాంటిక్ హారర్ ఫిల్మ్ ది రాజాసాబ్‌లో నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రానికి మారుతి దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే ఈ మూవీ పలుసార్లు వాయిదా పడుతూ వస్తోంది. ఇటీవల టీజర్ రిలీజ్ చేసిన మేకర్స్.. ది రాజాసాబ్ విడుదల తేదీని ఫిక్స్ చేశారు. ఈ ఏడాది డిసెంబర్ 5 థియేటర్లలో సందడి చేయనుందని ప్రకటించారు. ఈ చిత్రంలో నిధి అగర్వాల్‌తో పాటు రిద్ధి కుమార్, మాళవిక మోహన్ కథానాయికలుగా నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

### ప్రభుత్వ కారులో నిధి అగర్వాల్?

ఇటీవలే ఏపీకి ప్రభుత్వ కారులో నిధి అగర్వాల్ ప్రయాణించారు. ఓ ప్రైవేట్ ఈవెంట్‌కు వెళ్లిన నిధి అగర్వాల్‌కు ఏకంగా ఆన్ గవర్నమెంట్ డ్యూటీ అని బోర్డ్ ఉన్న కారులో వెళ్లారు. ఈ వీడియో కాస్తా సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రభుత్వంపై పెద్దఎత్తున విమర్శలొచ్చాయి. ఆ తర్వాత ఆ కారు ఏర్పాటులో తన ప్రమేయం లేదంటూ క్లారిటీ ఇస్తూ లేఖను పోస్ట్ చేసింది. గతనెల రిలీజైన హరిహర వీరమల్లులో హీరోయిన్‌గా నిధి అగర్వాల్ కనిపించింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com